సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
బుధవారం, 05.08.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 274
పేజీలు: 08 వెల: రూ. 5

## హైదరాబాద్‌లో కుండపోత

- గోదావరి శాంతం.. కృష్ణమ్మ ఉద్ధృతి
- తెలంగాణకు ఎల్లో.. ఏపీకి ఆరెంజ్ అలర్ట్ జారీ
- పిడుగుల హెచ్చరికతో ప్రజలను అప్రమత్తం చేసిన వాతావరణ శాఖ
- శ్రీశైలం వైపు భారీగా చేరుతున్న వరద నీరు
- వర్షా లతో ప్రాజెక్టుల్లో పెరుగుతున్న నీటి నిల్వలు
- రైతుల్లో ఆశలు నింపుతున్న తాజా వర్షా లు

02

తెలుగు రాష్ట్రాల్లో వానలు



## క్షుద్ర పూజల పంచాయితీ!

### కాంగ్రెస్‌బీఆర్ఎస్ మధ్య ఆరోపణల యుద్ధం

హరీష్‌రావుపై కాంగ్రెస్ ఆరోపణలు.. బీఆర్ఎస్ ఖండన



- మూకాంబిక ఆలయ దర్శనంపై రాజకీయ రగడ
- ఆరోపణలు, ఎదురుదాడులతో వేడెక్కిన తెలంగాణ రాజకీయాలు
- క్షుద్ర పూజల వివాదంతో రాష్ట్ర రాజకీయాల్లో కలకలం
- హిందూ మనోభావాలను దెబ్బతీశారంటూ కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ ఆగ్రహం
- రాజకీయ విమర్శలతో కొత్త మలుపు తీసుకున్న క్షుద్ర పూజల వివాదం

**ముద్ర డెస్క్ :**
తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మాటల యుద్ధం తీవ్రరూపం దాల్చింది. ఈసారి వివాదాని కి కేంద్రబిందువుగా నిలిచింది 'క్షుద్ర పూజలు' అంశం. బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావుపై టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ మహేష్ కుమార్ గౌడ్ చేసిన ఆరోపణలు రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారాయి. అధికారంలోకి తిరిగి రావాలనే ఉద్దేశంతో హరీష్‌రావు క్షుద్ర పూజ లు నిర్వహిస్తున్నారని, సినీ పాత్రలను ప్రస్తావిస్తూ తీవ్ర వ్యాఖ్యలు చేయడం వివాదానికి దారితీసింది. మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తమ వద్ద ఇందుకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని, నిర్దిష్ట తేదీల్లో హరీష్ రావు ఎక్కడెక్కడికి వెళ్లారో చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. ఈ ఆరోపణల నేపథ్యంలో కర్ణాటకలోని షిమోగా సమీపంలోని ప్రసిద్ధ కొల్లూరు మూకాంబికా దేవి ఆలయం పేరు రాజ కీయ చర్చల్లోకి వచ్చింది. హరీష్‌రావు ఆ ప్రాంతానికి వెళ్లి రహస్యంగా మిగతా 02లో

## అసెంబ్లీలో కాళేశ్వరం రణం!

### కాళేశ్వరంపై అసెంబ్లీలో హాట్ హాట్ చర్చకు రంగం సిద్ధం

కేసీఆర్ సభకు వస్తారా? రేవంత్ సవాల్‌తో ఉత్కంఠ

- మేడిగడ్డ రాజకీయాలు.. అధికార-ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం
- కాళేశ్వరం డిజైన్, నిధులపై కాంగ్రెస్ దూకుడు
- ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు బీఆర్ఎస్ ప్రతివ్యూహం
- రేవంత్-కేసీఆర్ ముఖాముఖి కోసం రాజకీయ వర్గాల ఎదురుచూపు
- వరదలతో మారిన రాజకీయ సమీకరణాలు
- సభలో సాగునీరు, కాళేశ్వరం అంశాలే హాట్ టాపిక్
- నిరుద్యోగం సహా ప్రజా సమస్యలను లేవనెత్తనున్న బీఆర్ఎస్
- తెలంగాణ రాజకీయాలకు టర్నింగ్ పాయింట్‌గా వర్షాకాల సమావేశాలు



**ముద్ర డెస్క్:** తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న వేళ రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఈసారి సమావేశాలకు కాళేశ్వరం ఎత్తిపోతల పథకం, మేడిగడ్డ బ్యారేజీ, ప్రాజెక్టు నిర్మాణ వ్యయం, నిధుల వినియోగం, రైతులకు సాగునీటి సరఫరా వంటి అంశాలు కేంద్రబిందువుగా మారనున్నాయి. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మొదటి నుంచే మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను నేరుగా అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని సవాల్ విసురుతుండగా, ఈసారి సభలో అధికార–ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి

**బీఆర్ఎస్‌కు రివర్స్ రాజకీయాలు**

కాళేశ్వరాన్ని రాజకీయంగా ప్రధాన అస్త్రంగా ఉపయోగించుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తుండగా, రైతులకు నీరు అందడం లేదనే అంశాన్ని ముందుకు తెచ్చి ప్రభుత్వాన్ని ఇబ్బందుల్లోకి నెట్టాలని బీఆర్ఎస్ ప్రయత్నించింది. ఇందులో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ నిరసనలు నిర్వహించింది. అయితే ఇటీవల భారీ వర్షాలతో ఎల్లంపల్లి నుంచి వరద నీరు సహజంగానే మేడిగడ్డ వైపు ప్రవహించడం, బ్యారేజీ సాంకేతిక పరిమితులు మరోసారి చర్చకు రావడం మిగతా 02లో

## విద్యా వ్యవస్థలో మార్పులు

- స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డు ఏర్పాటు
- ఒకే బోర్డు కింద స్కూల్ నుంచి ఇంటర్ విద్య
- 2027-28 నుంచి టీజీఎస్ఈబీ అమలుకు సన్నాహాలు
- 1971, 1982 విద్యా చట్టాలకు గుడ్‌బై
- తెలంగాణ విద్యా వ్యవస్థలో భారీ సంస్కరణలు

ఇంటర్ బోర్డు రద్దు 02




## దేశంలో కొత్త వైరస్

22 మంది మృతి.. 35 మందికి పాజిటివ్

- చిన్నారులపై తీవ్ర ప్రభావం
- అసలేంటి 'చాందీపుర వైరస్'
- ఎవరికి డేంజర్.. జాగ్రత్తలివీ

02





## ట్రంప్‌పై తిరుగుబాటు

ట్రంప్ కొత్త టారిఫ్‌లకు 25 అమెరికా రాష్ట్రాల సవాల్..

- స్వదేశంలోనే వ్యతిరేకత
- కోర్టు తీర్పుపై ఉత్కంఠ

03

## ఉదయనిధి స్టాలిన్ కి బిగ్ రిలీఫ్

02

త్రిషపై డబుల్ మీనింగ్ డైలాగ్ వివాదం

- కావేరీ వివాదంలో త్రిష రచ్చ..
- జైలుకి ఉదయనిధి..
- బెయిల్ మంజూరుతో విడుదల



## రెండో అతిపెద్ద మెడికల్ హబ్ వరంగల్ : కొండా

03

- ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధిపై మంత్రుల సమీక్ష
- మౌలిక వసతులు, సిబ్బంది భర్తీకి కీలక ఆదేశాలు



## ప్రతి గింజ ప్రజల ఆస్తే

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

- డిఫాల్ట్ మిల్లర్ల నుంచి ప్రతి రూపాయి, ప్రతి గింజను వసూలు చేస్తాం
- దశాబ్ద కాలం సీఎంఆర్ వ్యవస్థపై సమగ్ర ఆడిట్‌కు ఉత్తమ్ ఆదేశం

03



## ప్రభుత్వ కార్యాలయాలకు టీ ఫైబర్ ఇంటర్నెట్

సెప్టెంబర్ 1 తర్వాత ప్రైవేట్ ఆపరేటర్లకు బిల్లులు చెల్లించొద్దు : మంత్రి శ్రీధర్ బాబు

03

ఇంటింటికీ ఇంటర్నెట్ అందించే ప్రక్రియ వేగవంతం



## యుద్ధానికి సన్నద్ధం

పాకిస్తాన్ అంతర్గత సంక్షోభం నుంచి దృష్టి మళ్లించేందుకే

02

- సరిహద్దుల్లో చైనా క్షిపణుల మోహరింపు
- పీవోకే ఉద్యమాలు, టీటీపీ దాడులు, నిరసనల మధ్య భారత్ సరిహద్దుల్లో సైనిక మోహరింపులు
- అస్థిరత పెరుగుతున్న వేళ జాతీయతా భావాన్ని రెచ్చగొట్టే వ్యూహం



## రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం

ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు

- బ్రాండ్ ఆంధ్ర పునరుద్ధరణే లక్ష్యం..
- ప్రజలకు పారదర్శక పాలన
- పీ4తో 2.4 లక్షల కుటుంబాలకు సాయం
- సంపద పెరిగితేనే ఉపాధి, జీవన ప్రమాణాలు
- అభివృద్ధి లక్ష్యాలపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు



**ముద్ర, అమరావతి:**
రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం శ్వేతపత్రాలు విడుదల చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆర్థికశాఖపై శ్వేతపత్రాన్ని విడుదల చేసిన ఆయన, ఇది చారిత్రాత్మక ప్రక్రియ అని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశామని, ప్రభుత్వ పనితీరును ప్రజలకు ఎప్పటికప్పుడు ప్రోగ్రెస్ రిపోర్టుల రూపంలో తెలియజేయడం తమ బాధ్యత అని చెప్పారు. భోగాపురం మిగతా 02లో

## ఇదీ AI ముద్ర



## పునర్నవ కిడ్నీ స్టోన్స్‌ను తగ్గిస్తుందా?



ఆయుర్వేదంలో పునర్నవను మూత్ర పిండాల ఆరోగ్యానికి ఉపయోగించే ఔషధ మొక్కగా భావిస్తారు. ఇది వాపు తగ్గించడం, మూత్ర విసర్జనకు తోడ్పడడం వంటి ప్రయోజనాలు కలిగి ఉండవచ్చని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. కానీ కిడ్నీ రాళ్లను పూర్తిగా తొలగిస్తుందని నిర్ధారించే ఆధారాలు ఇంకా పరిమితంగానే ఉన్నాయి.

## రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై

# శ్వేతపత్రం

**(మొదటి పేజీ తరువాయి)**

అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం ప్రభుత్వ సమర్థ పాలనకు నిదర్శనమని సీఎం పేర్కొన్నారు. మంచి పాలన ఉంటే ప్రజలు ఎలా స్పందిస్తారో భోగాపురం ఉదాహరణగా నిలిచిందన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని అంతర్జాతీయ గేట్‌వేగా దానిని అభివృద్ధి చేశామని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి తాను కృషి చేశానని గుర్తు చేశారు.

విభజన అనంతరం రాష్ట్రం ఎదుర్కొన్న ఆర్థిక ఇబ్బందులను ప్రస్తావించిన సీఎం, ఒకప్పుడు ఉమ్మడి ఏపీలో తలసరి ఆదాయం రూ.95,231 ఉండగా, విభజన తర్వాత తెలంగాణలో అది రూ.1,24,104కు చేరిందని, ఏపీలో మాత్రం రూ.93,903కే పరిమితమైందన్నారు. అయితే ప్రస్తుతం రాష్ట్రం 13.5 శాతం సీఏజీఆర్ వృద్ధి స్థాయికి చేరుకుందని తెలిపారు. 2019-24 మధ్య జీఎస్‌డీపీ వృద్ధిరేటు 3.18 శాతం తగ్గడంతో రాష్ట్రానికి రూ.6.94 లక్షల కోట్ల నష్టం వాటిల్లిందని వెల్లడించారు. సామాజిక సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని చంద్రబాబు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమ పథకాలను విస్తృతంగా అమలు చేస్తున్నామని, కేంద్ర నిధులతో కూడా పలు కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వివరించారు. మహిళా సంఘాల కోసం రూ.14,757 కోట్లతో కార్యక్రమాలు చేపట్టామని, రాష్ట్రంలోని 97 శాతం మహిళా సంఘాలు బ్యాంకు రుణాలను వినియోగించుకుంటున్నాయని తెలిపారు.

సంపద పెరిగితేనే ఉపాధి, జీవన ప్రమాణాలు మెరుగవుతాయని పేర్కొన్న సీఎం, అదే లక్ష్యంతో పీ4 (P4) కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. ఈ పథకం ద్వారా ఇప్పటికే 2.4 లక్షల కుటుంబాలకు సహాయం అందుతోందని వెల్లడించారు. సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించి పేదరికం లేని రాష్ట్రాన్ని నిర్మించాలన్నదే తన లక్ష్యమని స్పష్టం చేశారు.

పెట్టుబడుల ఆకర్షణ కోసం 28 కొత్త పారిశ్రామిక విధానాలు తీసుకొచ్చామని, రూ.23 లక్షల కోట్ల విలువైన ఎంవోయూలు కుదుర్చుకున్నామని సీఎం తెలిపారు. దేశంలో పీపీపీ ప్రాజెక్టుల అమలులో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందన్నారు. ప్రజలకు అందుతున్న సేవలపై నిరంతరం అభిప్రాయ సేకరణ చేసి, వాటి ఆధారంగా పాలనలో మార్పులు చేస్తున్నామని చెప్పారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగంతో ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా అందిస్తున్నామని పేర్కొన్నారు.

చివరగా, అభివృద్ధికి సహకారమే మార్గమని, గొడవలతో ఏమీ సాధించలేమని, కష్టపడి పనిచేస్తే ఫలితం పదిరెట్లు ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు.

## అసెంబ్లీలో

# కాళేశ్వరం రణం!

**(మొదటి పేజీ తరువాయి)**

రాజకీయ సమీకరణాలను మార్చేసింది. మేడిగడ్డ పిల్లర్లు కుంగిన పరిస్థితుల్లో అక్కడ నీటిని నిల్వ చేయడం లేదా పంపింగ్ చేయడం ప్రమాదకరమని ప్రభుత్వం వాదిస్తుండగా, బీఆర్ఎస్ మాత్రం రైతులకు నీరు ఇవ్వకుండా ప్రభుత్వం రాజకీయాలు చేస్తోందని ఆరోపిస్తోంది. అయితే వరద ప్రవాహం, బ్యాక్‌వాటర్ పరిస్థితులు కాంగ్రెస్ వాదనకు బలం చేకూర్చడంతో బీఆర్ఎస్ రక్షణాత్మక ధోరణిలోకి వెళ్లాల్సి వచ్చిన పరిస్థితి ఏర్పడింది.

### కేసీఆర్‌ను సభకు రప్పించడమే కాంగ్రెస్ వ్యూహం

ఈ సమావేశాల్లో కాంగ్రెస్ ప్రధాన లక్ష్యం కేసీఆర్‌ను అసెంబ్లీకి రప్పించడమేనని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కేసీఆర్ సమక్షంలోనే కాళేశ్వరం డిజైన్, మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు, పీసీ ఘోష్ కమిషన్ విచారణ, రాష్ట్ర ఖజానాపై పడిన ఆర్థిక భారం వంటి అంశాలను ప్రస్తావించి బీఆర్ఎస్‌ను రాజకీయంగా ఇరుకున పెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.

గత సమావేశాలకు కేసీఆర్ దూరంగా ఉండడాన్ని కూడా సీఎం రేవంత్ రెడ్డి రాజకీయ అంశంగా మలుస్తూ, ప్రతిపక్ష నేతగా సభకు వచ్చి తమ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులను సమర్థించుకోవాలని బహిరంగంగా సవాల్ విసురుతున్నారు.

### ప్రతిదాడికి బీఆర్ఎస్ సిద్ధం

మరోవైపు బీఆర్ఎస్ కూడా ఈ సమావేశాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. కాళేశ్వరం ప్రాజెక్టులో ఏర్పడిన సాంకేతిక సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం రాజకీయ లబ్ధికోసం ప్రచారం చేస్తోందని, రైతులకు సాగునీరు అందించడంలో కాంగ్రెస్ విఫలమైందని సభలో గట్టిగా ప్రస్తావించేందుకు కేటీఆర్, హరీశ్ రావు వ్యూహాలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

అయితే అందరి దృష్టి మాత్రం కేసీఆర్ సభకు హాజరవుతారా లేదా అన్న అంశంపైనే నిలిచింది. ఒకవేళ కేసీఆర్ అసెంబ్లీకి వస్తే, రేవంత్-కేసీఆర్ మధ్య జరిగే ప్రత్యక్ష రాజకీయ సమరం తెలంగాణ రాజకీయాల్లో అత్యంత కీలక ఘట్టంగా నిలిచే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### ఇతర ప్రజా సమస్యలపైనా ఫోకస్

కాళేశ్వరం అంశంతో పాటు నిరుద్యోగం, రైతు సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, ఆర్థిక పరిస్థితి, అభివృద్ధి పనులు తదితర ప్రజా సమస్యలను కూడా సభలో ప్రధానంగా లేవనెత్తాలని బీఆర్ఎస్ యోచిస్తోంది. అధికార పార్టీ మాత్రం గత ప్రభుత్వ నిర్ణయాలు, ప్రాజెక్టుల నిర్వహణ, ఆర్థిక భారంపై దృష్టి సారించి ప్రతిపక్షాన్ని రక్షణాత్మక స్థితిలోకి నెట్టాలని చూస్తోంది. ఈ నేపథ్యంలో వర్షాకాల సమావేశాలు కేవలం శాసనసభ చర్చలకే పరిమితం కాకుండా, తెలంగాణ రాజకీయ భవిష్యత్ దిశను ప్రభావితం చేసే కీలక రాజకీయ పోరాట వేదికగా మారనున్నాయనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

# క్షుద్ర పూజల పంచాయితీ!

**(మొదటి పేజీ తరువాయి)**

క్షుద్ర పూజలు చేశారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. ప్రజా ప్రభుత్వాన్ని అస్థిరపరచాలనే కుట్రలో భాగంగానే బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ విమర్శించింది.అయితే ఈ ఆరోపణలను బీఆర్ఎస్ తీవ్రంగా ఖండించింది. తెలం గాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్, పవిత్రమైన మూకాంబికా దేవి ఆలయాన్ని రాజకీయాల్లోకి లాగడం హిందూ భక్తుల మనోభావాలను దెబ్బతీసే చర్య అని మండిపడ్డారు. ఆది శంకరాచార్యులు దర్శించిన పవిత్ర క్షేత్రాన్ని క్షుద్ర పూ జల కేంద్రంగా చిత్రీకరించడం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో విఫలమై ప్రజల దృష్టి మళ్లించేందుకే ఇటువంటి ఆరోపణలు చేస్తోందని దాసోజు శ్రవణ్ ఆరోపించారు. రాహుల్ గాంధీ, సిద్ధరామయ్య, డీకే శివకుమార్, తమిళనాడు నాయకుడు విజయ్ వంటి ప్రముఖులు కూడా మూకాంబికా ఆలయాన్ని సందర్శించారని, వారంతా కూడా క్షుద్ర పూజలే చేశారా అని ప్రశ్నించారు. అదే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి గురించే ఇలాంటి ప్రచారం జరుగుతోందంటూ ఎదురుదాడికి దిగారు.

ఇలా కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పరం ఆరోపణలు చేసుకుంటుండగా, పాలనాపరమైన సమస్యలు, ప్రజా సమస్యలపై చర్చించాల్సిన రాజకీయ పార్టీలు మూఢనమ్మకాలు, ఆరోపణల రాజకీయాలకు ప్రాధాన్యం ఇవ్వడం పట్ల ప్రజల్లో విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మూకాంబికా ఆలయాన్ని రాజకీయ వివాదంలోకి లాగినందుకు సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది.

# యుద్ధానికి సన్నద్ధం

**ముద్ర డెస్క్ :**
పాకిస్తాన్ ప్రస్తుతం తీవ్రమైన రాజకీయ, భద్రతా, ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటోంది. దేశంలోని పలు ప్రాంతాల్లో అశాంతి కొనసాగుతుండగా, అంతర్గత సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు భారత్ సరిహద్దు ఉద్రిక్తతలను పెంచే వ్యూహం అనుసరిస్తోందా అనే చర్చ వినిపిస్తోంది.

పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ప్రజా ఉద్యమాలు కొనసాగుతుండగా, బలూచిస్తాన్‌లో తిరుగుబాటుదారుల దాడులు భద్రతా బలగాలకు సవాలుగా మారాయి. మరోవైపు ఖైబర్ పఖ్తూన్వా ప్రాంతంలో తెహ్రీక్-ఎ-తాలిబాన్ పాకిస్తాన్ (టీటీపీ) ఉగ్రదాడులు పెరుగుతున్నాయి. మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ మద్దతుదారుల నిరసనలు, పెరుగుతున్న నిరుద్యోగం, ఆర్థిక ఇబ్బందులు ప్రభుత్వంపై మరింత ఒత్తిడిని పెంచుతున్నాయి. ఈ పరిణామాలు దేశంలో పాలనా వ్యవస్థను అస్థిరంగా మారుస్తున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఈ పరిస్థితుల్లో భారత్ సరిహద్దు వెంబడి సైనిక మోహరింపులు పెంచినట్లు నివేదికలు వెలువడుతున్నాయి. చైనా నుంచి అందిన హోవిట్జర్ గన్‌లను పలు ప్రాంతాల్లో మోహరించినట్లు సమాచారం. ఇది సాధారణ సైనిక ఆధునీకరణలో భాగమే అయినప్పటికీ, అంతర్గత సంక్షోభ సమయంలో ఈ చర్యలు చేపట్టడం వల్ల వాటి వెనుక వ్యూహాత్మక ఉద్దేశాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, బాహ్య శత్రువు అనే భావనను ముందుకు తీసుకువస్తే దేశంలోని వివిధ వర్గాలను ఒకే వేదికపైకి తీసుకురావచ్చని పాకిస్తాన్ పాలకవర్గం భావించే అవకాశం ఉంది. దీంతో జాతీయతా భావాన్ని పెంచి, ప్రభుత్వంపై వస్తున్న విమర్శల తీవ్రతను కొంతవరకు తగ్గించవచ్చనే అంచనాలు ఉన్నాయి. అయితే ఇలాంటి వ్యూహాలు తాత్కాలిక ప్రయోజనం మాత్రమే అందిస్తాయని, అసలు సమస్యలకు శాశ్వత పరిష్కారం కాదని నిపుణులు చెబుతున్నారు.

# దేశంలో కొత్త వైరస్..

**ముద్ర, ఢిల్లీ:** గుజరాత్‌లో చాందీపురా వైరస్ తీవ్రరూపం దాల్చింది. ఈ మహమ్మారి బారిన పడి ఇప్పటివరకు 22 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ఇప్పటివరకు 35 మందికి ఈ వైరస్ సోకినట్లు నిర్ధారణ అయింది. 15 సంవత్సరాల వయసు లోపు పిల్లల్లో దాదాపు 184 అనుమానిత కేసులు వెలుగుచూడగా, వాటిలో 11 నమూనాల పరీక్షా ఫలితాలు రావాల్సి ఉంది. గాంధీనగర్, సబర్కాంత-హిమత్‌నగర్, పటాన్, రాజ్‌కోట్, భావ్‌నగర్ సివిల్ ఆస్పత్రులలో ఏడుగురు బాధితులు అత్యవసర ప్రత్యేక వైద్యసేవలు పొందుతుండగా, ఆరుగురు కోలుకుని ఇళ్లకు వెళ్లినట్లు ఆరోగ్య మంత్రి ప్రఫుల్ తెలిపారు.

### నివారణ చర్యలు.. అత్యవసర ప్రణాళిక

వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి ఆరోగ్య శాఖ క్షేత్రస్థాయి బృందాలను రంగంలోకి దించింది. మట్టి గోడల్లోని పగుళ్లను పూడ్చివేయాలని, పశువుల పాకల చుట్టూ క్రిమిసంహారక మందులను పిచికారీ చేయాలని అధికారులు ప్రజలను కోరారు. తీవ్రమైన లక్షణాలు ఉన్న వారికి మల్టీ-ఆర్గన్ ఫెయిల్యూర్ రాకుండా ఆస్పత్రులలో ఆక్సిజన్, వెంటిలేటర్ సదుపాయం ఉన్న ఐసీయూ బెడ్లపై తక్షణ చికిత్స అందించాలని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులను ఆదేశించారు.

### చాందీపురా వైరస్ అంటే ఏమిటి?

మహారాష్ట్రలోని చాందీపురా గ్రామంలో 1965లో ఈ వైరస్ తొలిసారిగా వెలుగుచూసింది. అందుకే దీనికి ఆ పేరు వచ్చింది. ఇది రాబ్డోవిరిడే కుటుంబానికి చెందిన ఆర్ఎన్ఏ వైరస్. దోమలు, పేలు, ఇసుక ఈగలు (శాండ్‌ఫ్లైస్) ద్వారా ఇది వ్యాపిస్తుంది. ముఖ్యంగా మట్టి లేదా ఇసుకతో నిర్మించిన ఇళ్ల గోడల పగుళ్లలో ఇసుక ఈగలు జీవిస్తాయి. 9 నెలల నుంచి 14 సంవత్సరాల వయసున్న పిల్లలపై ఈ వైరస్ ఎక్కువగా ప్రభావం చూపుతుంది.

### వైద్య నిపుణుల హెచ్చరిక

వర్షాకాలంలో పిల్లలకు ఈ ముప్పు ఎక్కువగా ఉంటుందని బీహార్‌లోని పట్నాకు చెందిన ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్ కన్సల్టెంట్ డాక్టర్ నేహా ఖాన్ తెలిపారు. ఈ వైరస్‌ను నివారించడానికి ప్రస్తుతం ఎటువంటి వ్యాక్సిన్ అందుబాటులో లేదని తెలిపారు. మొదట జ్వరం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తాయని, ఆ తర్వాత మెదడు వాపు వ్యాధికి (ఎన్సెఫాలిటిస్) దారితీసి మూర్ఛ, స్పృహ కోల్పోవడం వంటి తీవ్ర పరిణామాలకు దారితీస్తుందని వివరించారు. ఈ వైరస్ ఒకరి నుంచి మరొకరికి సోకదన్నారు.

**ముద్ర డెస్క్ :**
నటి త్రిషపై అభ్యంతరకర వ్యాఖ్యల వ్యవహారంలో డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ ను పోలీసులు విడుదల చేశారు. ఈ కేసులో ఆయనకు బెయిల్ మంజూరు చేసిన మద్రాస్ హైకోర్టు.. విచారణ పూర్తయిన వెంటనే నేడే ఆయనను విడుదల చేయాలని పోలీసులను ఆదేశించింది. దీంతో మంగళవారం సాయంత్రం ఉదయనిధిని పోలీసులు విడుదల చేశారు. అసభ్య వ్యాఖ్యల కేసులో డీఎంకే నేతను ఇవాళ ఉదయం చెన్నైలోని ఆయన నివాసంలో పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

అరెస్టు అనంతరం ఆయనను తంజావూరుకు తరలించారని విచారణ సందర్భంగా తమిళనాడు అడ్వకేట్ జనరల్ విజయ్ నారాయణ్ మద్రాస్ హైకోర్టుకు తెలిపారు. ఈ కేసులో ఉదయనిధిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తీసుకోవాలనే ఉద్దేశం పోలీసులకు లేదని.. కేవలం విచారించి స్టేషన్ బెయిల్‌పై విడుదల చేయాలనుకుంటున్నట్లు పేర్కొన్నారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. ప్రశ్నించడం పూర్తయిన వెంటనే ఆయనను విడుదల చేయాలని ఉత్తర్వులిచ్చింది.

కావేరీ జల వివాదంపై సోమవారం ఉదయనిధి మాట్లాడుతూ.. టీవీకే ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఆయన ప్రసంగిస్తోన్న సమయంలో పలువురు కార్యకర్తలు త్రిష, త్రిష అంటూ నినాదాలు చేశారు. దీంతో ఆయన నటి గురించి ద్వంద్వార్థం ధ్వనించేలా అనుచితంగా మాట్లాడారు. అనంతరం తాను చెప్పింది కావేరీ గురించేనని వివరణ ఇచ్చారు. ఇది కాస్తా రాజకీయ దుమారానికి దారితీసింది. మహిళలను కించపర్చేలా ఉదయనిధి మాట్లాడారని, ఆయన వెంటనే క్షమాపణలు చెప్పాలని పలు రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయి. మరోవైపు.. డీఎంకే నేత వ్యాఖ్యలపై టీవీకే పార్టీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. ఉదయనిధిపై కేసు నమోదైంది. ఈ క్రమంలోనే ఆయన బెయిల్ కోసం హైకోర్టులో దరఖాస్తు చేసుకోగా.. న్యాయస్థానం అత్యవసరంగా విచారణ జరిపి ఆదేశాలిచ్చింది.



## ఉదయనిధి స్టాలిన్‌కి

# బిగ్ రిలీఫ్

## తెలంగాణలో విద్యా వ్యవస్థలో

# భారీ మార్పులు

**ముద్ర, హైదరాబాద్ :**
తెలంగాణ విద్యా వ్యవస్థలో ప్రభుత్వం కీలక సంస్కరణలకు శ్రీకారం చుడుతోంది. ప్రస్తుతం విడివిడిగా కొనసాగుతున్న పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థలను ఒకే పరిపాలనా వ్యవస్థ కిందకు తీసుకురావాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రస్తుతం ఉన్న ఇంటర్మీడియట్ బోర్డును రద్దు చేసి, తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డు (TGSEB)ను ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ మార్పుల కోసం 1971లో అమల్లోకి వచ్చిన పాఠశాల విద్యా చట్టం, 1982లో తీసుకొచ్చిన ఇంటర్మీడియట్ విద్యా చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో కొత్త సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం ఈ విలీన ముసాయిదా బిల్లు న్యాయశాఖ పరిశీలనలో ఉంది.

బిల్లుకు ప్రభుత్వం ఆమోదం తెలిపితే 2027-28 విద్యా సంవత్సరం నుంచి ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు మొత్తం విద్యా వ్యవస్థ ఒకే బోర్డు ఆధ్వర్యంలో కొనసాగనుంది. దీంతో పాఠ్యాంశాలు, పరీక్షల నిర్వహణ, విద్యా విధానాల్లో సమన్వయం పెరగడంతో పాటు పరిపాలన మరింత సమర్థవంతంగా మారుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే తెలంగాణ విద్యా రంగంలో ఇది అతిపెద్ద నిర్మాణాత్మక సంస్కరణగా నిలవనుంది. విద్యార్థులకు నిరంతర విద్యా ప్రణాళిక, ఏకీకృత విధానాలు అందుబాటులోకి రావడంతో విద్యా నాణ్యత మరింత మెరుగుపడే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

# కుండపోత



**ముద్ర డెస్క్ :**
తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ వర్షాలు జోరందుకున్నాయి. వాతావరణ శాఖ అంచనాలకు అనుగుణంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తుండగా, హైదరాబాద్‌లో మాత్రం కుండపోత వాన నగరాన్ని అతలాకుతలం చేసింది. మరోవైపు కొద్ది రోజులుగా ఉగ్రరూపం దాల్చిన గోదావరి వరద క్రమంగా తగ్గుముఖం పడుతుండగా, కృష్ణా నదిలో మాత్రం వరద ప్రవాహం రోజురోజుకూ పెరుగుతోంది. ఈ పరిణామాలు ఒకవైపు ప్రజల్లో అప్రమత్తతను పెంచుతుండగా.. మరోవైపు రైతుల్లో ఆశలు చిగురింపజేస్తున్నాయి.

### నగరం అస్తవ్యస్తం

సోమవారం సాయంత్రం నుంచి రాత్రివరకు హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షం నగర జీవనాన్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. సరూర్‌నగర్, ఉప్పల్, మాధాపూర్, గచ్చిబౌలి, జూబ్లీహిల్స్ తదితర ప్రాంతాల్లో కొద్ది గంటల్లోనే భారీ వర్షం కురవడంతో ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. లోతట్టు కాలనీల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కార్యాలయాల నుంచి తిరిగి వస్తున్న ఉద్యోగులు, వాహనదారులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు.

### తెలంగాణ జిల్లాలకు ఎల్లో అలర్ట్

హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో కూడా వర్షాలు కొనసాగుతున్నాయి. సిరిసిల్ల, సిద్ధిపేట, కామారెడ్డి, మెదక్, హనుమకొండ, జగిత్యాల, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్, వరంగల్, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, నల్గొండ, జనగామ, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.

### ఏపీలో ఆరెంజ్ అలర్ట్.. పిడుగుల హెచ్చరిక

ఆంధ్రప్రదేశ్‌లో కూడా పలు జిల్లాల్లో వర్షాలు కొనసాగనున్నాయి. ముఖ్యంగా ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు ఉభయ గోదావరి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. పిడుగులు పడే ప్రమాదం ఉండటంతో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని ప్రభుత్వం సూచించింది.

### శాంతించిన గోదావరి..

కొద్ది రోజుల క్రితం భయపెట్టిన గోదావరి వరద ఇప్పుడు క్రమంగా తగ్గుతోంది. భద్రాచలం వద్ద ఒక దశలో 55.90 అడుగులకు చేరిన నీటిమట్టం, సుమారు 15.84 లక్షల క్యూసెక్కుల ప్రవాహంతో ఉగ్రరూపం దాల్చింది. ప్రభుత్వం అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టడంతో పెద్ద ఎత్తున ప్రాణనష్టం తప్పింది. ప్రస్తుతం ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గడంతో భద్రాచలం వద్ద నీటిమట్టం తగ్గుతోంది. వేలేరుపాడు, కుక్కునూరు వంటి వరద ప్రభావిత మండలాల్లో పరిస్థితి క్రమంగా సాధారణ స్థితికి చేరుతోంది. నీటిలో మునిగిపోయిన రహదారులు బయటపడటంతో రాకపోకలు పునరుద్ధరించబడ్డాయి.

### కృష్ణమ్మ ఉద్ధృతి.. శ్రీశైలం వైపు భారీ వరద

గోదావరి తగ్గుముఖం పట్టినా కృష్ణా నదిలో వరద ఉద్ధృతి పెరుగుతోంది. జూరాల ప్రాజెక్టు నుంచి శ్రీశైలం జలాశయానికి సుమారు 1.71 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతోంది. దీంతో శ్రీశైలం నీటిమట్టం 854.5 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం జలాశయంలో 92.04 టీఎంసీల నీటి నిల్వ ఉండగా, ఇదే స్థాయిలో వరద కొనసాగితే మరో పది రోజుల్లో పూర్తి స్థాయికి చేరుకునే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. రాయలసీమకు కీలకమైన పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు కూడా భారీగా నీరు చేరుతుండటంతో సాగునీటి ఆశలు పెరుగుతున్నాయి. తుంగభద్ర జలాశయానికి ఎగువ నుంచి 13,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది.

### రైతుల్లో కొత్త ఆశలు

ఈ ఏడాది రుతుపవనాలు ఆలస్యంగా చురుకుదనాన్ని ప్రదర్శించినప్పటికీ, జూలై చివరి నుంచి వర్షాలు పెరగడం వ్యవసాయ రంగానికి ఊరటనిస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం ఎదుర్కొన్న రైతులకు ఇప్పుడు కురుస్తున్న వర్షాలు, ప్రాజెక్టుల్లో పెరుగుతున్న నీటి నిల్వలు ఆశాజనకంగా మారాయి. శ్రీశైలం, తుంగభద్ర వంటి ప్రధాన జలాశయాలు నిండితే రాబోయే సాగు సీజన్‌కు నీటి కొరత ఉండదన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

వాతావరణ శాఖ మరో రెండు రోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల వర్షాలు కొనసాగుతాయని హెచ్చరిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు మరియు నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని సూచిస్తోంది.

### కిడ్నీ రాళ్లకు ఎక్కువ నీరు తాగడం ఉత్తమ చిట్కా

కిడ్నీ రాళ్ల నివారణలో రోజుకు 2.5–3 లీటర్ల వరకు నీరు తాగడం అత్యంత ప్రభావవంతమైన అలవాటుగా వైద్యులు సూచిస్తారు. తగినంత నీరు తాగితే మూత్రం పలుచబడటంతో చిన్న రాళ్లు సహజంగా బయటకు వచ్చే అవకాశం పెరుగుతుంది.



# రెండో అతిపెద్ద మెడికల్ హబ్ వరంగల్

- తీర్చిదిద్దడమే లక్ష్యం: మంత్రి కొండా సురేఖ
- ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధిపై మంత్రుల సమీక్ష
- మౌలిక వసతులు, సిబ్బంది భర్తీకి కీలక ఆదేశాలు
- గ్రీన్ హాస్పిటల్స్ కోసం సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు నో
- ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం



**ముద్ర న్యూస్, వరంగల్ :** తెలంగాణలో హైదరాబాద్ తర్వాత వరంగల్‌ను రెండో అతిపెద్ద మెడికల్ హబ్‌గా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలలు, వైద్య సేవల విస్తరణపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి సమగ్ర సమీక్ష నిర్వహించారు.

ఈ సమావేశంలో ఎంజీఎం ఆసుపత్రి, సీకేఎం ఆసుపత్రి, కాకతీయ మెడికల్ కాలేజీ, నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సహా అన్ని ప్రభుత్వ వైద్య సంస్థల్లో మౌలిక వసతుల అభివృద్ధి, ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు, సిబ్బంది నియామకం, ఖాళీ పోస్టుల భర్తీపై కీలక సూచనలు చేశారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. అలాగే 'గ్రీన్ హాస్పిటల్స్' లక్ష్యంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని, సీకేఎం ఆసుపత్రిలో పేరుకుపోయిన స్క్రాప్‌ను తొలగించి స్థలాన్ని ఆసుపత్రి అవసరాలకు వినియోగించాలని సూచించారు.

వరంగల్ వైద్య సేవల పర్యవేక్షణ, సమన్వయం కోసం ప్రత్యేక అధికారిని నియమించాలని మంత్రి దామోదర రాజనర్సింహను మంత్రి సురేఖ కోరారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా ఎలాంటి లోటుపాట్లు లేకుండా కార్యాచరణ చేపట్టాలని వైద్యారోగ్య శాఖ అధికారులకు ఆమె ఆదేశించారు.

## డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కు పూర్తిస్థాయి అధికారిని నియమించాలి

**- హరీశ్ రావు**

**ముద్ర, హైదరాబాద్ :** డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కు వెంటనే పూర్తిస్థాయి అధికారిని నియమించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ వైద్య విద్య ఉద్యోగ జాయింట్ యాక్షన్ కమిటీ మంగళవారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ, గత రెండు నెలలుగా పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడంతో TVVP పరిధిలోని 184 ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ దెబ్బతింటోందన్నారు. వైద్యులు, సిబ్బంది సేవా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో పాటు ప్రజలకు వైద్య సేవలపై కూడా ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కు సంబంధించి వెంటనే కమిటీ ఏర్పాటు చేసి సర్వీస్ నిబంధనలు, మార్గదర్శకాలు రూపొందించాలని, శాశ్వత అధికారిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ప్రతి గింజ ప్రజల ఆస్తే...

**డిఫాల్ట్ మిల్లర్ల నుంచి ప్రతి రూపాయి, ప్రతి గింజను వసూలు చేస్తాం**
**దశాబ్ద కాలం సీఎంఆర్ వ్యవస్థపై సమగ్ర ఆడిట్‌కు ఉత్తమ్ ఆదేశం**
**డిఫాల్ట్ మిల్లర్లపై ఉక్కుపాదం – నిజాయితీ మిల్లర్లకు పూర్తి రక్షణ**



**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటైన తర్వాత తొలిసారిగా కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) వ్యవస్థపై గత 10–12 ఏళ్ల కార్యకలాపాలకు సమగ్ర ఆడిట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ధాన్యం సేకరణ నుంచి బియ్యం అప్పగింత వరకు జరిగిన లావాదేవీలు, మిల్లర్ల వారీగా డిఫాల్ట్ లు, పెండింగ్ బకాయిలు, రికవరీలు, విజిలెన్స్ కేసులు, న్యాయపరమైన చర్యలను సమీక్షించి, భవిష్యత్తులో లోపాలు పునరావృతం కాకుండా సంస్కరణలు చేపట్టాలని పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో సీఎంఆర్ బకాయిలు, ఎఫ్సీఐకి బియ్యం అప్పగింత, జిల్లాల వారీగా పెండింగ్ డిఫా ల్ట్లు, రికవరీల పురోగతిని మంత్రి పరిశీలించారు. ప్రభుత్వ లక్ష్యం శిక్షలు విధించడం కాదని, ప్రజల సొమ్ముతో కొనుగోలు చేసిన ధాన్యం, ప్రభుత్వానికి రావాల్సిన ప్రతి రూపాయిని తిరిగి రాబట్టడమేనని స్పష్టం చేశారు. పెండింగ్ బకాయిల్లో అధిక భాగం గత ప్రభుత్వాల కాలానికి చెందినవేనని అధికారులు వివరించారు.

రాష్ట్రవ్యాప్తంగా విజిలెన్స్ తనిఖీలు కొనసాగించాలని, మోసం లేదా ప్రభుత్వ ధాన్యం అక్రమ మళ్లింపులు వెలుగులోకి వస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి, అవసరమైతే బ్లాక్ లిస్టింగ్ కూడా చేపట్టాలని నిర్ణయించారు. సీఎంఆర్ విధానంలో ఒప్పంద నిబంధనలు కఠినతరం చేయడం, బ్యాంకు గ్యారంటీలను బలోపేతం చేయడం, సాంకేతికత ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థలు అమలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. క్యూఆర్ కోడ్ గన్నీ సంచులు, జీపీఎస్ వాహన ట్రాకింగ్, జియోట్యాగ్ తనిఖీలు, రియల్ టైమ్ స్టాక్ మానిటరింగ్, ఎఫ్ సీఐ–మిల్లింగ్–ప్రొక్యూర్ మెంట్ డేటా అనుసంధానం వంటి వ్యవస్థలను అమలు చేయనున్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు, ఎంఎస్ పీ చెల్లింపులు యథావిధిగా కొనసాగుతాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు.సమావేశంలో పౌరసరఫరాల శాఖ, తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ, విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్, ప్రొక్యూర్ మెంట్, ఫైనాన్స్, లాజిస్టిక్స్, లీగల్, మార్కెటింగ్ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మంత్రి చివరగా మాట్లాడుతూ, "రైతు చెమటతో పండిన ప్రతి గింజను ప్రభుత్వం ప్రజల సొమ్ముతో కొనుగోలు చేస్తోంది. కాబట్టి ప్రతి గింజకు ప్రభుత్వం కాపలాదారు. ప్రజల ఆస్తిని కాపాడటంలో, ప్రభుత్వ బకాయిలను పూర్తిగా రాబట్టటంలో, ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయటంలో ఎలాంటి రాజీ ఉండదు" అని స్పష్టం చేశారు.

### ఇక ప్రభుత్వ కార్యాలయాలకు

# 'టీ-ఫైబర్' ఇంటర్నెట్ మాత్రమే...

**సెప్టెంబర్ ఒకటి తర్వాత ప్రైవేట్ ఆపరేటర్లకు బిల్లులు చెల్లించొద్దు**
**ఇంటింటికి ఇంటర్నెట్ అందించే ప్రక్రియను మరింత వేగవంతం చేయండి**
**'టీ - ఫైబర్' సమీక్షా సమావేశంలో అధికారులను ఆదేశించిన మంత్రి శ్రీధర్ బాబు**



**ముద్ర, హైదరాబాద్ :** రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాల యాలకు సెప్టెంబర్ ఒకటి నుంచి కేవలం 'టీ–ఫైబర్' ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. ఆ గడువు దాటిన తర్వాత ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంటర్నెట్ సేవల నిమిత్తం ప్రైవేట్ ఆపరేటర్లకు బిల్లులు చెల్లించొద్దని స్పష్టం చేశారు. మంగళవారం డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో 'టీ – ఫైబర్'పై అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... టీ–ఫైబర్ నెట్‌వర్క్ వినియోగం ద్వారా ఏటా ప్రభుత్వానికి సుమారు రూ.300 కోట్ల నుంచి రూ.400 కోట్ల వరకు ఆదా అయ్యే అవకాశముందని వెల్లడించారు. అంతేకాకుండా... ఇంట్రానెట్ బేసిస్‌లో సెక్యూర్డ్ ఇంటర్నెట్ యాక్సెస్ కల్పించడం ద్వారా రాష్ట్ర డేటా సెంటర్‌కు అనుసంధానం ఏర్పడి, పూర్తి స్థాయి డేటా సెక్యూరిటీ చేకూరుతుందన్నారు. గత ఆరు నెలల్లోనే రాష్ట్రవ్యాప్తంగా 4,487 ప్రభుత్వ కార్యాలయాలకు 'టీ – ఫైబర్' ద్వారా ఇంటర్నెట్ సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఫలితంగా... ప్రభుత్వ ఖజానాకు ఇప్పటికే సుమారు రూ.13 కోట్లు ఆదా అయ్యిందన్నారు. మరిన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఈ సేవలను విస్తరించేందుకు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ ప్రక్రియలో క్షేత్రస్థాయిలో తలెత్తే లోపాలను ఎప్పటికప్పుడు సరిచేస్తూనే... రాబోయే రోజుల్లోనూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తెలంగాణ వైడ్ ఏరియా నెట్‌వర్క్(టీ – స్వాన్)ను నెల రోజుల్లోపు పూర్తిస్థాయిలో టీ–ఫైబర్‌కు బదిలీ చేయాలని సంబంధిత అధికారులను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'భారత్ ఫ్యూచర్ సిటీ'కి పూర్తిస్థాయిలో ఇంటర్నెట్ సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేయాలని 'టీ–ఫైబర్'కు సూచించారు. అలాగే... ఇంటింటికి ఇంటర్నెట్ అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని, దీనికోసం ప్రిన్సిపుల్ మానిటైజేషన్ పార్టనర్‌ను ఎంపిక చేసేందుకు టెండర్లు పిలవాలని దిశా నిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో సీఎస్ సంజయ్ జాజు, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, టీ–ఫైబర్ ఎండీ వేణు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రంప్ పై తిరుగుబాటు

- ట్రంప్ కొత్త టారిఫ్‌లకు 25 అమెరికా రాష్ట్రాల సవాల్..
- స్వదేశంలోనే వ్యతిరేకత
- కోర్టు తీర్పుపై ఉత్కంఠ



**ముద్ర డెస్క్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రవేశపెట్టిన కొత్త దిగుమతి టారిఫ్‌లపై వివాదం మరింత ముదురుతోంది. ట్రంప్ ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త టారిఫ్ విధానాన్ని వ్యతిరేకిస్తూ డెమోక్రాటిక్ పార్టీ పాలిత 25 రాష్ట్రాలు అమెరికా కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్‌ను ఆశ్రయించాయి. ఈ టారిఫ్‌ల అమలును వెంటనే నిలిపివేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వాలు పిటిషన్ దాఖలు చేశాయి.ఈ రాష్ట్రాల వాదన ప్రకారం, ట్రంప్ ప్రభుత్వం విధించిన కొత్త టారిఫ్‌లు చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించకుండా అమలు చేశాయి. దీంతో అమెరికాలోకి దిగుమతి అయ్యే అనేక వస్తువుల ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని అవి పేర్కొన్నాయి. చివరికి ఈ భారం వ్యాపార సంస్థలు, చిన్న వ్యాపారులు, సాధారణ వినియోగదారులపై పడుతుందని ఆందోళన వ్యక్తం చేశాయి.

గత నెలలో ట్రంప్ ప్రభుత్వం ప్రపంచంలోని 60 దేశాల నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 10 నుంచి 12.5 శాతం వరకు టారిఫ్‌లు విధించింది. బలవంతపు కార్మిక వ్యవస్థ (Forced Labour) ద్వారా తయారైన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లలోకి ప్రవేశించకుండా అడ్డుకోవడమే ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం ప్రకటించింది. ఇతర దేశాలు కూడా ఈ సమస్యపై మరింత కఠిన చర్యలు తీసుకునేలా ఒత్తిడి తీసుకురావడమే లక్ష్యమని ట్రంప్ ప్రభుత్వం వివరణ ఇచ్చింది.

అయితే ఈ కారణాన్ని ప్రభుత్వం కేవలం సాకుగా ఉపయోగిస్తోందని పిటిషన్ దాఖలు చేసిన రాష్ట్రాలు ఆరోపిస్తున్నాయి. గతంలో న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొన్న విస్తృత స్థాయి టారిఫ్‌లను మరోసారి అమలు చేసేందుకు "ఫోర్స్డ్ లేబర్" అంశాన్ని కారణంగా చూపుతోందని పేర్కొన్నాయి. అంతేకాకుండా, ఇలాంటి కీలక ఆర్థిక నిర్ణయాలకు ముందు పాటించాల్సిన చట్టపరమైన విధానాలను ప్రభుత్వం విస్మరించిందని కూడా ఆరోపించాయి.మరోవైపు ట్రంప్ ప్రభుత్వం మాత్రం తన నిర్ణయాన్ని సమర్థించుకుంటోంది. అమెరికా కార్మికుల ప్రయోజనాలను కాపాడటంతో పాటు దేశీయ పరిశ్రమలకు రక్షణ కల్పించడమే ఈ టారిఫ్‌ల ప్రధాన ఉద్దేశమని పేర్కొంది. అలాగే ప్రపంచ దేశాలు బలవంతపు కార్మిక వ్యవస్థపై కఠిన చర్యలు తీసుకునేలా ఈ విధానం ఉపయోగపడుతుందని ప్రభుత్వం విశ్వాసం వ్యక్తం చేసింది.ఈ కొత్త టారిఫ్ విధానం ప్రభావం భారత్‌పైనా పడింది. అయితే ప్రారంభంలో భారత్‌పై 12.5 శాతం టారిఫ్ విధించే ప్రతిపాదన ఉండగా, విదేశీ వాణిజ్య నిబంధనల్లో కొన్ని మార్పులు చేసిన తర్వాత దానిని 10 శాతానికి తగ్గించినట్లు సమాచారం. అయినప్పటికీ భారత ఎగుమతిదారులు ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారు.ప్రస్తుతం ఈ వ్యవహారం అమెరికా కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ పరిశీలనలో ఉంది. కోర్టు ఇచ్చే తీర్పు ట్రంప్ ప్రభుత్వ వాణిజ్య విధానాల భవిష్యత్తుపై కీలక ప్రభావం చూపే అవకాశముంది. అంతేకాకుండా అమెరికా దిగుమతి విధానాలు, అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలు, ప్రపంచ మార్కెట్లపై కూడా ఈ తీర్పు ప్రభావం ఉండొచ్చని నిపుణులు భావిస్తున్నారు.

## షూటర్ ఇషా సింగ్‌కు స్పోర్ట్స్ అథారిటీ సన్మానం



**ముద్ర, హైదరాబాద్ :** హాంగ్ జౌ, చైనాలో జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్ పిస్టల్ షూటింగ్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించి భారత దేశానికి గర్వకారణంగా నిలిచిన ప్రముఖ షూటర్ ఈషా సింగ్ ను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ. సోని బాలాదేవి సన్మానించారు. ఈరోజు హైదరాబాద్ లోని ఎల్ బీ స్టేడియం స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఈషా సింగ్ కు డాక్టర్ సోని బాలాదేవి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆమె సాధించిన ఈ విజయం దేశ కీర్తిని అంతర్జాతీయ వేదికపై మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లిందని పేర్కొన్నారు. పిస్టల్ షూటింగ్ విభాగంలో వరుసగా రెండు ప్రపంచకప్ స్వర్ణ పతకాలను గెలుచుకున్న తొలి షూటర్ గా ఇషా సింగ్ చరిత్ర సృష్టించడం ఎంతో గర్వకారణమని ఆమె కొనియాడారు. భవిష్యత్తులోనూ ఇలాంటి మరెన్నో విజయాలు సాధించి భారతదేశానికి, తెలంగాణకు మరిన్ని అంతర్జాతీయ కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ, ఇషా సింగ్ కు డాక్టర్ ఎ. సోని బాలాదేవి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## సీఎం ప్రజావాణిలో కొత్తగా మీ-సేవా కేంద్రం ఏర్పాటు

- ప్రారంభించిన చిన్నారెడ్డి
- పాల్గొన్న విద్యాసాగర్, రవి కిరణ్
- సీఎం ప్రజావాణిలో 321 దరఖాస్తులు




**ముద్ర , హైదరాబాద్ :** సీఎం ప్రజావాణిలో కొత్తగా ఏర్పాటు చేసిన మీ–సేవా కేంద్రాన్ని ప్రజావాణి ఇన్‌చార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ ఆఫీసర్ కే. విద్యాసాగర్, మీ–సేవా డైరెక్టర్ రవికిరణ్ మంగళవారం ప్రారంభించారు. ఇందిరమ్మ డబుల్ బెడ్‌రూమ్ సహా వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన దరఖాస్తులు, ధ్రువపత్రాల సేవలు ఒకేచోట అందించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 321 దరఖాస్తులు అందగా, పంచాయతీరాజ్ శాఖకు 144, రెవెన్యూ శాఖకు 51, హోంశాఖకు 25, ప్రవాసి ప్రజావాణికి 2, ఇతర శాఖలకు 99 దరఖాస్తులు వచ్చాయి. పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న కంటింజెన్సీ ఉద్యోగులు 18 నెలల బకాయి వేతనాల చెల్లింపును కోరగా, డాక్టర్ చిన్నారెడ్డి డీజీపీ సీవీ ఆనంద్‌తో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎసిపి ఉమేందర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎన్నారై సలహా మండలి వైస్ చైర్మన్ మంద భీమ్ రెడ్డి, సమన్వయకర్త బొజ్జ అమరేందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 36 దేశాల నుంచి 274 మంది పరారీ నేరస్థులు స్వదేశానికి

**ముద్ర, ఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో 2021–2026 మధ్య 36 దేశాల నుంచి 274 మంది పరారీ నేరస్థులను భారత్‌కు తిరిగి తీసుకొచ్చినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. పరారీ నేరస్థుల అప్పగింతను జాతీయ ప్రాధాన్యతగా తీసుకుని చట్టపరమైన సంస్కరణలు, ఇంటర్‌పోల్ సమన్వయం, సాంకేతికత ఆధారిత దర్యాప్తును బలోపేతం చేసినట్లు పేర్కొంది. గత మూడేళ్లలో 401 మంది పరారీ నేరస్థులపై ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయగా, 2019–2026 మధ్య పీఎంఎల్ఏ కింద రూ.17,874 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసినట్లు వెల్లడించింది. అలాగే, భారత్‌పోల్, ఆపరేషన్ త్రిశూల్ వంటి చర్యలతో విదేశాల్లో తలదాచుకున్న నేరస్థుల ఆచూకీ గుర్తించి స్వదేశానికి రప్పించే ప్రక్రియను మరింత వేగవంతం చేసినట్లు తెలిపింది.

## డల్లాస్‌లో డిప్యూటీ సీఎం భట్టికి ఘన స్వాగతం

**ఎన్ఆర్ఐ టీపీసీసీ, ఐఓసీ ఆధ్వర్యంలో విమానాశ్రయంలో ఆత్మీయ స్వాగతం**

**ముద్ర, హైదరాబాద్ :** అమెరికా పర్యటనలో ఉన్న తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్కకు డల్లాస్ నగరంలో నేడు ఘన స్వాగతం లభించింది. బాల్టిమోర్ నగరంలో గత మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన 'ఆట' మహాసభల వేడుకల్లో పాల్గొన్న ఆయన.. ఆ కార్యక్రమాల ముగింపు అనంతరం అక్కడి నుంచి బయలుదేరి డల్లాస్ చేరుకున్నారు. డల్లాస్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న డిప్యూటీ సీఎంకు ఎన్ఆర్ఐ టీపీసీసీ, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ప్రతినిధులు, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రవాస భారతీయులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఎయిర్‌పోర్టుకు చేరుకుని ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి తమ అపారమైన అభిమానాన్ని చాటుకున్నారు.

డల్లాస్ నగరంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. ఈ పర్యటనలో ఆయన పలు కీలక సమావేశాల్లో పాల్గొననున్నారు. రాష్ట్ర పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధికి ఉపకరించే విధంగా.. సింగరేణి అధికారుల బృందంతో కలిసి ఆయన 'క్రిటికల్ మినరల్స్' అంశంపై వివిధ బహుళజాతి కంపెనీల ప్రతినిధులతో విస్తృతస్థాయి చర్చలు జరపనున్నారు. అత్యాధునిక సాంకేతికత, పెట్టుబడుల ఆకర్షణ దిశగా ఈ సమావేశాలు జరగనున్నాయి.డిప్యూటీ సీఎంకు స్వాగతం పలికిన వారిలో నెహ్రూ కొమ్మినేని, అచ్యుత్ తుమ్మల, మధు ఇరుగు, వసంత్ బొబ్బల, రాజ్ బెజ్జల, హరి నాథ్ శీలం, వద్దె రాజేష్, ప్రమోద్ రెడ్డి, రిషిత్ సలవాది, రేవంత్ రెడ్డి, దుష్యంత్ బొక్క, సందీప్ తదితరులు ఉన్నారు.

## ఆగస్టు 15లోగా 13,046 వ్యవసాయ కుంటలు పూర్తి చేయాలి

**రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్**



**ముద్ర, హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 15లోగా 13,046 వ్యవసాయ కుంటల నిర్మాణాన్ని పూర్తి చేయాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దానకిషోర్ జిల్లా అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన తెలంగాణ జలసిరి, గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక అమలును సమీక్షించారు. ప్రతి గ్రామంలో వ్యవసాయ కుంటల పనులను వేగవంతం చేయడంతో పాటు నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని, క్షేత్రస్థాయిలో ప్రతిరోజూ తనిఖీలు నిర్వహించి లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ దివ్యతో పాటు శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
బుధవారం 05.08.2026



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# హితులు- స్నేహితులు

ఒక్కసారి గట్టిగా ఊపిరి పీల్చి..
మన మంచి స్నేహితులను
గుర్తు చేసుకుందాం.

తను 20 సం క్రిందట
వెళ్లిపోయాడు.. వాడు కూడా
పోయి పదేళ్ళయింది. ఇలా
ఇంకొక స్నేహితుడు. అలాగే
ఇంకొక ప్రియ మిత్రుడు,
ఒక్కొక్కరు వెళ్లినప్పుడు ఒక్కొక్క
గాయం.
ఆ గాయాలన్నీ కలిసి అప్పుడప్పుడు
ఒక పెద్ద శూన్యతగా మారడం
70 లేదా 75 సం వయసులో
సహజం!

పిల్లలు బాగున్నారు.. కానీ వారి
వ్యాపకాల్లో వారుంటారు.
గౌరవానికి కొదువ లేదు.

కానీ ఓ స్నేహితుడితో ఉండే ప్రైవసీ
ఆ సరదా క్షణాలు కూడా కావాలి
కదా.

నిద్ర పట్టడం లేదు, బోర్
కొడుతున్నది. ఎవరితో
మాట్లాడాలి?
నా స్నేహితులెక్కడ?
వాళ్ళు పోయారే. ఇక అంతేనా?
ఉదయం లేచి కాఫీ తాగేటప్పుడు
"ఏరా, బాగున్నావా?" అని అడిగే
స్నేహితుడెక్కడ?

ఓ ప్రాపర్టీ అమ్మాలనుకున్నా,
కొనాలనుకున్నా ఎవరు
నమ్మకమైన సలహా ఇస్తారు?

ఓ మంచి డాక్టర్ ని అవసరాల్లో
అత్యంత నమ్మకంగా ఎవరు
చెబుతారు?

ఒక స్నేహితుడు ఓ సందర్భంలో
అన్నాడు, "నా భార్య పోయిన
తర్వాత మొదటిసారి నీ ముందు
ఏడిచాను.
నువ్వు నన్ను ఓదార్చలేక... నువ్వూ
నాతో పాటు ఏడిచావు."
ఆ రోజు నాకు తెలిసింది – స్నేహం
అంటే ఒంటరితనాన్ని
జయించడమని.!

మరొక స్నేహితుడు ఇలా అన్నాడు:
"నా సమస్య చెప్పకుండా దాచాను.
కానీ నువ్వు రావటం చూసి... నీతో
చెప్పగలిగితే... భయం కాస్త
తగ్గుతుందనిపించింది.
చావంటే భయం కాదు...
ఒంటరిగా చావడం భయంగా
ఉంది." అన్నాడు.

ఒకరు డాక్టర్ దగ్గరకు వెళ్తున్నానంటే
"నేను కూడా వస్తా" అనే
మిత్రుడుండాలి.

ఒంటరితనం అనిపిస్తే "రా...
ఇంటికి రా... ఇద్దరం కూర్చుని
మాట్లాడదాం లేకపోతే
రమ్మంటావా" అనే
మిత్రుడుండాలి.

"ఏరా గుర్తుకొచ్చావ్.
ఎలా ఉన్నావు?
నీతో మాట్లాడాలనిపిస్తోంది."
అనే మిత్రుడుండాలి.

ఒక స్నేహితుడు రాత్రి 11:30కి
మెసేజ్ చేస్తాడు,
"నిద్ర పట్టడం లేదు రా...
ఒంటరిగా అనిపిస్తోంది."
"నేనూ అలాగే ఉన్నా.
కలుసుకుందామా?"
కలుసుకుని మనసు తీరా ఓ రెండు
గంటలు మాటలు.



"నేనున్నా రా... భయపడకు"
ఆ భరోసాలో ఎంత ధైర్యం
ఆ మాట చెప్పగలిగినవాడు
ఒక్కడైనా ఉంటే చాలు.

అలాంటి బంధమే వృద్ధాప్యంలో
అతి పెద్ద ఆసరా అవుతుంది.

ఇలాంటి అనుభూతులే
మన చివరి రోజుల్లో మనకు అతి
పెద్ద ఆసరా అవుతాయి.

స్నేహితులను కలుసుకుంటూనే
ఉంటాం, తొక్కలో 'ఇగో'
మాటల్లో ఎక్కడో తేడా కొట్టుద్ది.
క్షణాల్లో సంవత్సరాల పరిచయానికి
తెర పడుతుంది.

కొందరితో ఎలాగూ కలవదు.
దానివల్ల పెద్ద నష్టం ఏమీ ఉండదు.
కాని చిన్ని చిన్ని కారణాలతో మంచి
స్నేహితులను వదులుకుంటే
చివరికి ఎవరూ మిగలరు.

దయచేసి ఈ ఒక్క విషయం
గుర్తుంచుకొని, చిన్న చిన్న
కారణాలతో మంచి స్నేహం
పాడుచేసుకోకండి..

# ఒక్క ఆకు..సర్వరోగ నివారిణి

ప్రకృతిలో లభించే ఎన్నో రకాల మొక్కలు ఆరోగ్యాన్ని అందిస్తాయి. అయితే కొన్ని ఆకులు మన వంటింట్లోనే ఉంటాయి. కానీ ఇవి ఇచ్చే ప్రయోజనాల గురించి కొంత మందికి మాత్రమే తెలుసు. దీంతో వారు ఎప్పటికీ వాటిని వంటల్లో ఉపయోగిస్తుంటారు. అలాంటి వాటిలో ఒక్క బిర్యానీ ఆకు.. శరీరానికి అవసరమైన ఆరోగ్యాన్ని ఇవ్వడంతో పాటు ఇంట్లో ఉన్న కొన్ని సమస్యలకు పరిష్కార మందుగా ఉపయోగపడుతుంది.



మనం మసాలా కూరలు లేదా బిర్యానీని తయారు చేసుకునేటప్పుడు బిర్యానీ ఆకును చూస్తాం.. ఇది కేవలం సువాసన కోసమే వాడుతామని చాలా మందికి తెలుసు. కానీ దీని వల్ల ఇంట్లో ఉన్న కొన్ని సమస్యలకు పరిష్కారంగా నిలుస్తుంది. ముఖ్యంగా వంటిట్లోకి పురుగులురాకుండా.. ఇంట్లోకి దోమలు రాకుండా అడ్డుకుంటుంది. అలాగే మంచి నిద్ర పట్టడానికి ఇది ఆరోగ్య ప్రదాయినిగా నిలుస్తుంది.

ఈ ఆకులో ఉండే సహజ సువాసనతో వంటింట్లో ఉన్న పదార్థాలను కాపాడగలుగుతుంది. ముఖ్యంగా బియ్యం, పప్పులు, పిండి పదార్థాల్లో చేరే చిన్న కీటకాలను దూరంగా ఉంచడంలో కొంతవరకు సహాయపడుతుందని చెబుతారు. అందుకే చాలామంది బియ్యం డబ్బాలు, పప్పుల డబ్బాల్లో ఒకటి లేదా రెండు ఎండిన బిర్యానీ ఆకులను వేస్తుంటారు.

బిర్యానీ ఆకులోని సుగంధ నూనెల వాసన దోమలకు అంతగా ఇష్టంగా ఉండదని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. కొందరు ఎండిన బిర్యానీ ఆకును కాల్చి వచ్చే పొగను ఉపయోగిస్తుంటారు. దీని వాసన వల్ల కొంతసేపు దోమలు దూరంగా ఉండే అవకాశం ఉంది. అయితే ఇది దోమల నివారణకు నిర్ధారితమైన లేదా దీర్ఘకాలిక పరిష్కారం కాదని మరికొందరు అంటారు.

ఇందులో ఉండే సుగంధ తైలాల వాసన కొందరిలో మనసుకు ప్రశాంతతను కలిగించి విశ్రాంతి భావనను కలిగించవచ్చు. అందువల్ల ఒత్తిడి తగ్గి నిద్రకు అనుకూల వాతావరణం ఏర్పడవచ్చు. బిర్యానీ ఆకులో యాంటీ ఆక్సిడెంట్లు, కొన్ని విటమిన్లు, ఖనిజాలు స్వల్ప మోతాదులో ఉంటాయి.

# పేదల గుడిసెలపై ఉక్కుపాదం

## పెద్దల ఆక్రమణలపై మౌనమా?

చట్టం ముందు అందరూ సమానమే అని భారత రాజ్యాంగం చెబుతోంది. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ చట్టాలు స్పష్టంగా పేర్కొంటున్నాయి. అయితే చట్టం అమలులోనూ అందరికీ సమాన న్యాయం జరుగుతోందా? లేక పేదలకు ఒక న్యాయం, ప్రభావశీలులకు మరో న్యాయమా? అనే ప్రశ్నలు మహబూబాబాద్ జిల్లాలో బలంగా వినిపిస్తున్నాయి. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భూముల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు పేరుతో తరచూ అధికారులు చర్యలు చేపడుతున్నారు. నివాసం కోసం 70–80 గజాల స్థలంలో గుడిసె వేసుకునే నిరుపేదలపై రెవెన్యూ, మున్సిపాలిటీ, పోలీసు శాఖలు వెంటనే స్పందిస్తున్నాయనే అభిప్రాయం ఉంది. నోటీసులు, కూల్చివేతలు, కేసులు వంటి చర్యలు వేగంగా కనిపిస్తాయి. అదే సమయంలో, ప్రజల్లో వినిపిస్తున్న ఆరోపణల ప్రకారం, విలువైన ప్రభుత్వ భూ ములపై పెద్ద ఎత్తున ఆక్రమణలు జరిగాయని, కొన్ని చోట్ల శాశ్వత నిర్మాణాలు కూడా వెలిశాయని చెబుతున్నారు. ఆరోపణలు నిజమా కాదా అన్నది అధికారులు పారదర్శకంగా వెల్లడించాల్సిన అవసరం ఉంది.

### చట్టం పేదలకేనా?

రెవెన్యూ చట్టాలు ఎక్కడా "పేదలకు ఒక చట్టం – ధనికులకు మరో చట్టం" అని చెప్పలేదు. ఆక్రమణదారుడు ఎవరు అనే దానికంటే, ఆక్రమణ జరిగిందా లేదా అన్నదే చట్టం పరిశీలించే అంశం కావాలి. అయితే ప్రజలలో ఏర్పడిన భావన మాత్రం భిన్నంగా ఉంది. చిన్న గుడిసె వేసుకున్న పేద కుటుంబం లక్ష్యంగా మారుతుంటే, కోట్ల రూపాయల విలువైన భూములపై జరిగినట్లు ఆరోపణలు ఉన్న పెద్ద నిర్మాణాల విషయంలో ఎందుకు అదే వేగం కనిపించడం లేదని ప్రశ్నిస్తున్నారు.



### ప్రజల్లో వినిపిస్తున్న ప్రధాన ప్రశ్నలు

ప్రభుత్వ భూముల పూర్తి జాబితా ప్రజలకు ఎందుకు అందుబాటులో లేదు?
గత పది సంవత్సరాల్లో ఎన్ని ఎకరాల ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్నారు?
ఎన్ని ఆక్రమణలపై కేసులు నమోదు అయ్యాయి?
పెద్ద ఎత్తున నిర్మాణాలు జరిగాయని వినిపిస్తున్న ప్రాంతాల్లో సర్వేలు జరిగాయా?
అధికారుల పరిశీలన నివేదికలు ప్రజలకు వెల్లడించారా?
ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావడం ప్రజాస్వామ్య పరిపాలనకు అవసరం. ఎంపిక చేసిన అమలు ప్రజల్లో అనుమానాలకు దారి తీస్తుంది
చట్టం అందరికీ సమానంగా అమలు కాకపోతే ప్రజల్లో ప్రభుత్వ వ్యవస్థపై విశ్వాసం దెబ్బతింటుంది. పేదలపై కఠిన చర్యలు తీసుకుంటూ, ప్రభావశీలులపై మౌనం పాటిస్తున్నారనే అభిప్రాయం ఏర్పడితే అది ప్రభుత్వ ప్రతిష్ఠకే నష్టం కలిగిస్తుంది.

### మహబూబాబాద్‌లో సర్వే అవసరం

జిల్లాలోని అన్ని ప్రభుత్వ భూములను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మళ్లీ సర్వే చేయాలి. భూముల విస్తీర్ణం, ప్రస్తుత స్థితి, ఆక్రమణల వివరాలను ప్రజల ముందుంచాలి. ప్రజా పోర్టల్‌లో భూ మ్యాపులు, సర్వే వివరాలు అందుబాటులో ఉంచితే పారదర్శకత పెరుగుతుంది.

### పరిశీలించాల్సిన అంశాలు

ప్రజల్లో వినిపిస్తున్న వాదనల ప్రకారం, పట్టణ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములపై జరిగినట్లు చెప్పబడుతున్న ఆక్రమణలు, శాశ్వత నిర్మాణాలు, భారీ ప్రహరీ గోడలు, లేఅవుట్లు వంటి అంశాలపై స్వతంత్ర విచారణ జరగాలని కోరుతున్నారు. ఈ ఆరోపణలు నిజమా కాదా అన్నది అధికారిక విచారణ ద్వారానే తేలాలి.

### కోర్టుల స్పష్టత అవసరం

కోర్టు సముదాయం సమీపంలోని ప్రభుత్వ భూముల స్థితిగతులపై కూడా పూర్తి వివరాలు వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు. రికార్డుల్లో ఉన్న విస్తీర్ణం ఎంత? ప్రస్తుతం ఎంత ఉంది? ఎలాంటి మార్పులు జరిగాయి? అనే అంశాలపై పారదర్శక నివేదిక విడుదల చేయాలి.

### పరిపాలనకు ఇదే పరీక్ష

నిజాయితీగల పరిపాలన అంటే పేదల గుడిసెలు కూల్చడం మాత్రమే కాదు; కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను కూడా కాపాడటం. చట్టం అమల్లో హోదా, సంపద, ప్రభావం అనే తేడా లేకుండా వ్యవహరించినప్పుడే ప్రభుత్వాన్ని నమ్ముతారు.

### ప్రజల డిమాండ్

జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి జిల్లా ప్రభుత్వ భూములన్నింటిపై సమగ్ర సర్వే నిర్వహించాలి.

### శ్వేతపత్రం విడుదల చేయాలి.

బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ఒకే ప్రమాణంతో చట్టాన్ని అమలు చేయాలి. ప్రజల ఫిర్యాదులకు పారదర్శక వ్యవస్థ ఏర్పాటు చేయాలి.

చివరగా ఒకే ప్రశ్న.. 80 గజాల్లో గుడిసె వేసు కున్న పేదపై చట్టం వెంటనే అమలైతే, ఎకరాల కొద్దీ ప్రభుత్వ భూమి ఆక్రమించబడిందనే ఆరోపణలు ఉన్న చోట కూడా అదే చ ట్టం, అదే వేగంతో అమలవుతోందా? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సింది ప్రజలు కాదు.. సంబంధిత ప్రభుత్వ యంత్రాంగమే.

**గొడుగు శ్రీనివాస్**
సీనియర్ జర్నలిస్టు

# నిశ్శబ్ధంగా జీవితాన్ని మార్చే అలవాట్లు



మన జీవితాన్ని మార్చడానికి ఎప్పుడూ పెద్ద నిర్ణయాలు లేదా భారీ మార్పులు అవసరం లేదు. ప్రతిరోజూ చేసే చిన్న చిన్న మంచి అలవాట్లే కాలక్రమేణా గొప్ప విజయాలకు, మంచి ఆరోగ్యానికి, ప్రశాంతమైన మనసుకు పునాది అవుతాయి. ఒక్కరోజులో జీవితంలో అద్భుతం జరగకపోవచ్చు. కానీ ప్రతిరోజూ ఒక మంచి అలవాటు పాటిస్తే, కొన్ని నెలలు లేదా సంవత్సరాల తర్వాత మీలో వచ్చిన మార్పు చూసి మీరే ఆశ్చర్యపోతారు.



చిన్న అలవాట్లు మొదట్లో చాలా సాధారణంగా కనిపిస్తాయి. కానీ అవే మన వ్యక్తిత్వాన్ని, ఆరోగ్యాన్ని, ఆలోచనా విధానాన్ని, ఆర్థిక పరిస్థితిని, కుటుంబ సంబంధాలను క్రమంగా మెరుగుపరుస్తాయి. అందుకే విజయవంతమైన వ్యక్తులు ప్రతిరోజూ తమ అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ చూపుతారు.

### కాఫీ లేదా టీ తాగే ముందు గ్లాసు నీరు

రాత్రంతా నిద్రపోయిన తర్వాత శరీరంలో నీటి శాతం తగ్గుతుంది. ఉదయం లేవగానే ఒకటి లేదా రెండు గ్లాసుల నీరు తాగడం వల్ల శరీరం మళ్లీ హైడ్రేట్ అవుతుంది. జీర్ణ వ్యవస్థ చురుకుగా పనిచేస్తుంది. శక్తి పెరుగుతుంది. ఆ తర్వాత కాఫీ లేదా టీ తాగితే శరీరంపై దాని ప్రభావం కూడా సమతుల్యంగా ఉంటుంది.

### రేపటి పనులను రాత్రే ప్లాన్ చేసుకోండి

ఉదయం లేవగానే ఏమి చేయాలో ఆలోచిస్తూ సమయం వృథా చేయాల్సిన అవసరం ఉండదు. రాత్రే పనుల జాబితా రాసుకుంటే ఒత్తిడి తగ్గుతుంది. పనులు సమయానికి పూర్తవుతాయి. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

### ప్రతికూలంగా మాట్లాడవద్దు..

"నేను చేయలేను", "నా వల్ల కాదు", "నేను పనికిరాను" వంటి ఆలోచనలు మన ఎదుగుదలను అడ్డుకుంటాయి. వాటి స్థానంలో "నేను నేర్చుకుంటాను", "ప్రయత్నిస్తాను", "నాకు సాధ్యమే" అనే సానుకూల ఆలోచనలను అలవాటు చేసుకోవాలి.

### ఉదయం మంచాన్ని సర్దుకోవడం

ఇది చిన్న పనిలా కనిపించినా, రోజును క్రమశిక్షణతో ప్రారంభించడానికి ఇది గొప్ప అలవాటు. ఇంటి వాతావరణం శుభ్రంగా ఉంటుంది. మనసులో కూడా ఒక కొత్త ఉత్సాహం కలుగుతుంది.

### నెమ్మదిగా ఆహారం నమిలి తినండి

త్వరత్వరగా తినడం వల్ల ఎక్కువ ఆహారం తినే అవకాశం ఉంటుంది. బాగా నమిలి తింటే జీర్ణక్రియ మెరుగుపడుతుంది. కడుపు త్వరగా నిండిన భావన కలుగుతుంది. ఊబకాయం ప్రమాదం తగ్గుతుంది.

### ప్రతి నెల కొంత పొదుపు చేయండి

పెద్ద మొత్తాలు కాకపోయినా చిన్న చిన్న పొదుపులు భవిష్యత్తులో పెద్ద ఆర్థిక భద్రతను కల్పిస్తాయి. అత్యవసర పరిస్థితుల్లో అప్పులు చేయాల్సిన అవసరం తగ్గుతుంది.

### కనీసం 10 నిమిషాలు నడవండి

నడక వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. రక్తప్రసరణ బాగా జరుగుతుంది. జీర్ణక్రియ మెరుగవుతుంది. మానసిక ఒత్తిడి తగ్గుతుంది. మధుమేహం, రక్తపోటు నియంత్రణలో ఉండటానికి కూడా ఇది ఎంతో ఉపయోగపడుతుంది.

### మాటను నిలబెట్టుకోండి

వ్యాయామం చేస్తానని నిర్ణయించుకుంటే చేయాలి. పుస్తకం చదువుతానంటే చదవాలి. మీపై మీకు నమ్మకం పెరగాలంటే మీ మాటకు మీరు విలువ ఇవ్వాలి.

### ప్రతిరోజూ ఐదు పేజీలు చదవండి

పుస్తకాలు మనకు కొత్త ఆలోచనలు, కొత్త జ్ఞానం అందిస్తాయి. రోజుకు ఐదు పేజీలు చదివినా సంవత్సరానికి వేల పేజీలు పూర్తవుతాయి. అది మీ వ్యక్తిత్వాన్ని పూర్తిగా మార్చగలదు.

### భోజనం చేసేప్పుడు మొబైల్ వద్దు

మొబైల్ చూస్తూ తింటే ఎక్కువ ఆహారం తినే అవకాశం ఉంటుంది. భోజనంపై దృష్టి పెడితే జీర్ణక్రియ మెరుగుపడుతుంది. కుటుంబ సభ్యులతో మాట్లాడే అవకాశం కూడా పెరుగుతుంది.

### కొద్దిసేపు సూర్యరశ్మి పడాలి

ఉదయం సూర్యకాంతి శరీరానికి విటమిన్–D అందించడంలో సహాయపడుతుంది. జీవ గడియారాన్ని సక్రమంగా ఉంచుతుంది. నిద్ర నాణ్యత మెరుగుపడుతుంది. మానసిక ఉల్లాసం కూడా పెరుగుతుంది.

### కోపంతో స్పందించే ముందు ఆగండి

ఒక నిమిషం ఆగి ఆలోచిస్తే అనవసర గొడవలు తగ్గుతాయి. సంబంధాలు బలపడతాయి. తర్వాత పశ్చాత్తాపపడే మాటలు చెప్పకుండా ఉండగలుగుతాం.

### చిన్న ప్రాంతాన్ని శుభ్రం చేయండి

ఒక టేబుల్, ఒక డ్రాయర్ లేదా ఒక షెల్ఫ్ అయినా శుభ్రం చేయండి. శుభ్రమైన వాతావరణం మనసుకు ప్రశాంతతను ఇస్తుంది. పనిపై ఏకాగ్రత పెరుగుతుంది.

### నిద్రకు ముందు స్ట్రెచ్ చేయండి

కండరాలు సడలుతాయి. నడుము, మెడ నొప్పులు తగ్గుతాయి. మంచి నిద్ర వస్తుంది. మరుసటి రోజు శరీరం తేలికగా ఉంటుంది.

### కృతజ్ఞత భావాన్ని వ్యక్తపరచండి

మీకు లభించిన ఆరోగ్యం, కుటుంబం, ఆహారం, స్నేహితులు, అవకాశాలకు కృతజ్ఞత చెప్పడం వల్ల మనసులో సంతృప్తి పెరుగుతుంది. అసంతృప్తి తగ్గుతుంది. ఆనందంగా జీవించగలుగుతారు.

జీవితాన్ని మార్చేది ఒక్కసారిగా జరిగే పెద్ద సంఘటనలు కాదు. ప్రతిరోజూ మనం చేసే చిన్న మంచి అలవాట్లే మన భవిష్యత్తును నిర్మిస్తాయి. ఆరోగ్యం, ఆర్థిక స్థిరత్వం, మంచి సంబంధాలు, ప్రశాంతమైన మనసు, విజయవంతమైన జీవితం ఇవన్నీ ఒక్కో చిన్న అలవాటు నుంచి ప్రారంభమవుతాయి.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 05.08.2026
www.mudranews.in | @mudranews


## కిడ్నీ రాళ్లకు ఉప్పు, జంక్ ఫుడ్ తగ్గించండి

అధిక ఉప్పు, ప్రాసెస్డ్ ఫుడ్, చిప్స్ వంటి పదార్థాలు కాల్షియం రాళ్ల ప్రమాదాన్ని పెంచుతాయి. తక్కువ ఉప్పు, సమతుల ఆహారం తీసుకోవడం కిడ్నీ ఆరోగ్యానికి మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు.




## ఎల్లమ్మ తల్లికి బోనం



**ముద్ర, శంకర్‌పల్లి:** ఆషాఢ మాస బోనాల పండుగ సందర్భంగా శంకర్‌పల్లి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శ్వేతా పాండురంగారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి అత్యంత భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించారు. సంప్రదాయబద్ధంగా బోనం సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.ఆలయ ప్రాంగణంలో భక్తులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని మునిసిపల్ ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో జీవించాలని ఎల్లమ్మ తల్లిని ప్రార్థించారు.

## పోరాటాలతోనే కార్మిక సమస్యలకు పరిష్కారం

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలే మార్గమని తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి అన్నారు.ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో జిల్లా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేసి నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే హజార్డ్ అలవెన్స్, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు.సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు బీజీ క్లెమెంట్, తోట రామాంజనేయులు, బుర్రి ఉపేంద్రతో పాటు పలువురు కార్మిక నాయకులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



**ముద్ర, మేడ్చల్:** మేడ్చల్—మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. కె. ఆనంద్ మంగళవారం శ్రీరంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆరోగ్య సేవల అమలు తీరును పరిశీలించారు.ఔట్‌పేషెంట్ సేవలు, గర్భిణులు, శిశు ఆరోగ్య సేవలు, టీకాల కార్యక్రమం, ఔషధ నిల్వలు, ల్యాబ్ సేవలు, శుభ్రత, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను సమీక్షించి, రోగులకు మరింత మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.అనంతరం సిబ్బందితో సమావేశమై కేంద్రంలో ఉన్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గతంలో ఇదే పీహెచ్‌సీలో వైద్యాధికారిగా పనిచేసిన డా. ఆనంద్, నాణ్యమైన ఆరోగ్య సేవలందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని సూచించారు.

## సీపీఆర్‌పై అవగాహన




**ముద్ర, మల్కాజిగిరి:** అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో సీపీఆర్ అందిస్తే ప్రాణాలను కాపాడే అవకాశాలు పెరుగుతాయని సెంజాన్ అంబులెన్స్ ఇండియా సీనియర్ ఫ్యాకల్టీ కలారి సంతోష్‌కుమార్ తెలిపారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మల్కాజిగిరిలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీపీఆర్ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని, గుండెపోటు లేదా శ్వాస ఆగిన వ్యక్తికి సీపీఆర్ అందించే విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులతో సాధన చేయించి వారి సందేహాలను నివృత్తి చేశారు.కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బండి రాజు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు ప్రాణరక్షక నైపుణ్యాలను కూడా నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు ఇవ్వాలి

**అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి**

**ముద్ర ప్రతినిధి, ఉమ్మడి రంగారెడ్డి:** ప్రతి శిశువుకు పుట్టిన గంటలోపే తల్లిపాలు అందించడం అత్యంత అవసరమని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి తెలిపారు.ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా కొండాపూర్ ఏరియా ఆసుపత్రిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, రెండు సంవత్సరాల వరకు తల్లిపాలను కొనసాగిస్తూ వయస్సుకు తగిన పౌష్టికాహారం అందించాలని సూచించారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారం, వ్యాధినిరోధక శక్తిని అందిస్తాయని చెప్పారు.జిల్లా వైద్యాధికారి డాక్టర్ స్వర్ణకుమారి మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, బాలింతలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




## తాండూరులో ఎస్ఐఆర్‌పై బీఆర్ఎస్ సమీక్ష

**71 శాతం డిజిటలైజేషన్ పూర్తి**

**ముద్ర, తాండూర్:** తాండూర్ నియోజకవర్గంలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో 71 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీశైల్ రెడ్డి పంజుగుల తెలిపారు. మంగళవారం బీఆర్ఎస్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి సూచనల మేరకు పార్టీ బీఎల్ఏలు ఎస్ఐఆర్ ప్రక్రియలో చురుకుగా పనిచేస్తున్నారని చెప్పారు. బోగస్, డబుల్, మృతుల ఓట్ల పరిశీలన కారణంగా ప్రక్రియ కొంత ఆలస్యమవుతోందన్నారు. మిగిలిన గడువులో ప్రతి గ్రామంలో పార్టీ శ్రేణులు మరింత అప్రమత్తంగా పనిచేయాలని, ఇంకా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని వారు వెంటనే అందజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నూతన కమిటీకి అభినందన

**ముద్ర ప్రతినిధి, తాండూర్:** తాండూర్ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులను బీసీ కమిషన్ మాజీ సభ్యులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శుభ ప్రద పటేల్ సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, కుటుంబ బాంధవ్యాల ప్రాముఖ్యతను బోధించాలని సూచించారు. సమాజానికి బాధ్యతాయుతమైన పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు విద్యాసంస్థలు కృషి చేయాలని కోరారు.అనంతరం అధ్యక్షుడు మోహన్ కృష్ణ గౌడ్, గౌరవ అధ్యక్షుడు కీర్తి శర్మ, ఉపాధ్యక్షుడు అబ్దుల్ వహీద్, కార్యదర్శి వెంకటేశం, సంయుక్త కార్యదర్శి సునీత, కోశాధికారి రమేష్ గౌడ్, సలహాదారు సోహెల్ ఉమ్రిలను శాలువాలతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌పీ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



## ఫీజు బకాయిల విడుదల కోరుతూ బీజేపీ వినూత్న నిరసన

**ముద్ర, కూకట్‌పల్లి :** ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కూకట్‌పల్లి భరత్‌నగర్ కూరగాయల మార్కెట్‌లో బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో వినూత్న నిరసన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని కూరగాయలు విక్రయించడం, బస్తాలు మోయడం, రోడ్లు ఊడ్చడం ద్వారా ప్రభుత్వ వైఖరిని నిరసించారు. అనంతరం వ్యాపారులు, ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు.ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రాజేశ్వరరావు హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వ్యాపారులు, స్థానికులు పాల్గొన్నారు.



## తాండూరులో తెలంగాణ రక్షణ సేన జెండా ఆవిష్కరణ

**ముద్ర, తాండూరు:** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాండూరు నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర యువజన అధ్యక్షుడు కంచర్ల శివారెడ్డి అన్నారు.మంగళవారం తాండూరు అంబేద్కర్ చౌక్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఇందిరా చౌక్‌లో బసవేశ్వర, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు నివాళులర్పించారు.ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామ గ్రామాన పార్టీని బలోపేతం చేస్తామని, ఈ నెల 6న హైదరాబాద్‌లో సామాజిక తెలంగాణ న్యాయ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం పార్టీ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## పట్టణ వ్యాపారస్తులు సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలి

**డీఎస్పీ శ్రీనివాసరావు**

**ముద్ర, దేవరకొండ:** :నల్గొండ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ శరత్ చంద్ర పవార్ ఆదేశానుసారం దేవరకొండ డీఎస్పీ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి సీఐ నవీన్ కుమార్, ఎస్ఐ అజ్మీరా రమేష్ పోలీసు సిబ్బంది సమక్షంలో స్థానిక పోలీస్ స్టేషన్ లో వ్యాపారులు వివిధ వర్తక సంఘాల ప్రతినిధులతో సీసీ కెమెరాల ఏర్పాటు కార్యక్రమంపై డిఎస్పీ అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ ప్రజల సహకారంతో ప్రతి వ్యాపార సంస్థ, దుకాణం, వాణిజ్య సముదాయం ప్రధాన కూడళ్లలో నాణ్యమైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా దొంగతనాలు, చోరీలు ఇతర నేరాలను అరికట్టడంతో పాటు, నేరాల దర్యాప్తు వేగవంతంగా జరిగి నిందితులను త్వరగా గుర్తించే అవకాశం ఉంటుందని తెలిపారు.వ్యాపారులు తమ దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని ఎప్పటికప్పుడు పనిచేసే స్థితిలో ఉంచాలని పోలీసు శాఖ చేపడుతున్న కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో వర్తక సంఘాల ప్రతినిధులు పోలీసు శాఖ కార్యక్రమాన్ని అభినందిస్తూ సీసీ కెమెరాల ఏర్పాటుకు తమ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.



## సీఎంఆర్ అక్రమాలపై ప్రత్యేక బృందం దర్యాప్తు

**సూర్యాపేటలో మిల్లర్లు, అధికారుల్లో గుబులు**

**ముద్ర, సూర్యాపేట:** కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కేటాయింపుల్లో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ప్రత్యేక బృందం సూర్యాపేట జిల్లాలో విస్తృతంగా విచారణ చేపట్టింది. రెండు వారాలుగా మిల్లుల రికార్డులు, ధాన్యం నిల్వలు, సీఎంఆర్ కేటాయింపులను పరిశీలిస్తున్న బృందం మరో రెండు రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు సమాచారం.ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గతంలో సీఎంఆర్ బకాయిలు ఉన్న మిల్లులు, డిఫాల్ట్ అయిన మిల్లులు, మూతపడిన మిల్లులు, కార్యకలాపాలు ప్రారంభించని మిల్లులకు కూడా సీఎంఆర్ కేటాయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో కొందరు సివిల్ సప్లై అధికారుల పాత్రపై కూడా ప్రత్యేక బృందం దృష్టి సారించినట్లు తెలుస్తోంది.మిల్లుల ట్రాక్ రికార్డు, ధాన్యం నిల్వలు, గత నాలుగేళ్ల సీఎంఆర్ కేటాయింపులు, క్షేత్రస్థాయి పర్యవేక్షణ వంటి అంశాలపై లోతుగా విచారణ కొనసాగుతోంది. కలెక్టర్‌కు సమర్పించిన నివేదిక కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం.ప్రత్యేక బృందం నివేదిక ఆధారంగా అక్రమాలకు పాల్పడినట్లు తేలితే సంబంధిత రైస్ మిల్లర్లు, వారికి సహకరించిన అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## నీలోఫర్ లో బాలింతలకు కనీస వైద్య సౌకర్యాలు లేకపోవడం దురదృష్టం

**తెలంగాణ రక్షణ సేన మహిళ విభాగం రాష్ట్ర అధ్యక్షులు మనోజ గౌడ్**

**ముద్ర, హైదరాబాద్:** నీలోఫర్ హాస్పిటల్ లో బాలింతలను కూర్చిలో కూర్చొపెట్టి వైద్యం అందించడం సిగ్గు చేటని తెలంగాణ రక్షణ సేన మహిళ విభాగం రాష్ట్ర అధ్యక్షులు పడాల మనోజ గౌడ్ విమర్శించారు. నీలోఫర్ లో కనీస వైద్య సౌకర్యాలు లేక బాలింతలు, గర్భిణులు ఇబ్బంది పడుతున్నారనే సమాచారం టీఆర్ఎస్ మహిళ విభాగం నేతలు మంగళవారం హాస్పిటల్ సందర్శించేందుకు వెళ్లారు. నీలోఫర్ హాస్పిటల్ సెక్యూరిటీ సిబ్బంది, హాస్పిటల్ సిబ్బంది మహిళా నాయకులు లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. హాస్పిటల్ లో పరిస్థితులను చిత్రీకరిస్తున్న ఫొటోగ్రాఫర్ల దగ్గరి నుంచి కెమెరాలు, మైక్‌లు లాక్కునే ప్రయత్నం చేశారు. హాస్పిటల్ సిబ్బంది, సెక్యూరిటీ తీరుపై టీఆర్ఎస్ మహిళ నాయకులు మండిపడ్డారు. గర్భిణులకు కనీస వైద్య సదుపాయాలు కల్పించాలని కోరితే దౌర్జన్యానికి పాల్పడుతారా అని ప్రశ్నించారు. సరైన వైద్య సేవలు అందిస్తే తమను ఎందుకు లోపలికి పంపించడం లేదని నిలదీశారు. మహిళలకు కనీస వైద్య సౌకర్యాలు లేవని, ఒక్కో బెడ్ ను ముగ్గురు పేషెంట్లకు కేటాయిస్తున్నారని తెలిపారు. ఆపరేషన్ అయిన పేషెంట్లను స్ట్రెచర్ పై తీసుకెళ్లకుండాం నడిపించుకుంటూ తీసుకెళ్లడం అత్యంత దారుణమన్నారు. నీలోఫర్ హాస్పిటల్ లో జరుగుతున్న ఘటనలపై రాష్ట్ర ప్రభుత్వంలోని మహిళ మంత్రులు స్పందించాలని డిమాండ్ చేశారు. హాస్పిటల్ లో సరైన వసతులు కల్పించాలని కోరారు. లేదంటే ప్రభుత్వం మెడలు వంచైనా వసతులు కల్పించేలా చేస్తామని హెచ్చరించారు.



## బిల్డ్ నౌ' పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

**ముద్ర, శేరిలింగంపల్లి:** భవన నిర్మాణ అనుమతులకు సంబంధించిన 'బిల్డ్ నౌ' పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ అధికారులను ఆదేశించారు.జోనల్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో అభివృద్ధి పనులు, పెండింగ్ ఫైళ్లు, బడ్జెట్ కేటాయింపులు, సిబ్బంది జీతాల క్లియరెన్స్, హరితహారం, పార్కుల నిర్వహణ, రోడ్లు, డ్రైనేజీలు, ఇతర ఇంజనీరింగ్ పనుల పురోగతిని సమీక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా అన్ని పనులు పూర్తి చేయాలని సూచించారు.సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్, సిటీ ప్లానర్, ఫైనాన్స్ అధికారులు, ఇంజనీరింగ్, ఆరోగ్య శాఖల అధికారులు పాల్గొన్నారు.



## కేంద్ర మంత్రి కుమారస్వామితో తెలంగాణ బీజేపీ ఎంపీల బృందం భేటీ

**ముద్ర, మల్కాజిగిరి:** కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామిని తెలంగాణ బీజేపీ ఎంపీల బృందం కలిసింది. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక పారిశ్రామిక అంశాలపై కేంద్ర మంత్రితో విస్తృతంగా చర్చించింది.ఈ సందర్భంగా సీసీఐ ఆదిలాబాద్, తాండూర్ యూనిట్ల సమస్యలతో పాటు బీహెచ్ఈఎల్, బీడీఎల్ సంస్థలకు సంబంధించిన అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆయా పరిశ్రమల పరిరక్షణ, అభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపుపై తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీలు కోరారు.మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని హెచ్ఎంటీ సంస్థను రక్షణ శాఖ పరిధిలోకి తీసుకురావాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కేంద్ర మంత్రి కుమారస్వామికి విజ్ఞప్తి చేశారు. హెచ్ఎంటీలో ఉన్న మౌలిక సదుపాయాలు, సాంకేతిక సామర్థ్యాలను వినియోగించి ఆయుధాల విడిభాగాల తయారీ కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. దీనివల్ల స్థానికంగా పరిశ్రమ అభివృద్ధి చెందడంతో పాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు.తెలంగాణ ఎంపీలు ప్రస్తావించిన అంశాలపై మరోసారి సమగ్రంగా చర్చించేందుకు ఈరోజు సాయంత్రం 4 గంటలకు తిరిగి సమావేశం అవుదామని కేంద్ర మంత్రి కుమారస్వామి తెలిపారు.



## ‘6 గ్యారెంటీలు’ గాలికి.. ‘6 సీ’లతో కాంగ్రెస్ పాలన



**మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్**

**ముద్ర, మల్కాజిగిరి:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా ‘6 గ్యారెంటీలు’ను విస్మరించి, ‘6 సీ’ల పాలన కొనసాగిస్తోందని బీజేపీ సీనియర్ నాయకుడు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ విమర్శించారు.హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నేరాలు, అవినీతి, కమీషన్లు, కాంట్రాక్టులు, హైకమాండ్‌కు కప్పం, ప్రభుత్వ వ్యవస్థలపై ఆధిపత్యంతో రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్ర అప్పులు పెరుగుతుండగా మంత్రుల ఆస్తులు పెరుగుతున్నాయని అన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి కేసులపై విచారణ చేస్తామని చెప్పిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక ఆ హామీలను విస్మరించిందని విమర్శించారు. ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీజేపీ అన్ని మండలాల్లో నిలదీస్తుందని తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

**ముద్ర, కాప్రా:** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేష ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఒక్కో వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షిస్తే భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించగలం. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని పరిరక్షించడం కూడా అందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎంసీ కమిషనర్ విజయ్ కృష్ణా రెడ్డి, జోనల్ కమిషనర్ రాధికా గుప్తా పాల్గొని, నగరాన్ని మరింత పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు విస్తృత స్థాయిలో మొక్కలు నాటాలని ప్రజల కోరారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
బుధవారం 05.08.2026
www.mudranews.in | @mudranews



## కిడ్నీ నొప్పి ఎక్కువైతే

ఇంటి చిట్కాలు చిన్న రాళ్లు ఉన్నప్పుడు మాత్రమే కొంత ఉపశమనం ఇవ్వొచ్చు. తీవ్రమైన నొప్పి, జ్వరం, మూత్రంలో రక్తం, మూత్రం రాకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే యూరాల జిస్టును సంప్రదించాలి. పెద్ద రాళ్లకు మందులు లేదా ఇతర వైద్య చికిత్స అవసరం కావచ్చు.



# మానవత్వం చాటుకున్న మంత్రి అడ్లూరి..

- ప్రమాద సమయం నుంచి అంత్యక్రియల వరకు అండగా..
- మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం, ఇందిరమ్మ ఇళ్లు..

**ముద్ర న్యూస్, ధర్మపురి:** రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ మరో మారు తన మానవత్వాన్ని చాటుకున్నారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం వడ్డెర కాలనీ ప్రభుత్వ స్కూల్ లో చదువుతున్న విద్యార్థులు మరణించిన విషయం తెలిసినప్పటి నుంచి విద్యార్థుల అంత్యక్రియలు పూర్తి అయ్యే వరకు జగిత్యాల జిల్లా అధికారులను అప్రమత్తం చూస్తూ అడుగడుగునా బాధిత కుటుంబాలకు అండగా నిలిచారు.

జగిత్యాల రూరల్ మండలం టీఆర్ నగర్ కి చెందిన సుశాంత్ 4వ తరగతి, నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ కి చెందిన విష్ణు 5వ తరగతి విద్యార్థులు మల్యాల ఎస్సీ హాస్టల్ లో ఉంటూ వడ్డెర కాలని ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు బయటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి సోమవారం మృతి చెందిన విషయం తెలిసిందే..

విద్యార్థుల మృతి పై రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విచారం వ్యక్తం చేసి మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపి చేతులు దులుపుకోలేదు.. బాధిత కుటుంబాలకు అండగా నిలిచారు. మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి ప్రభుత్వం తరఫున రూ. 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం, కుటుంబంలో ఒకరికి అవుట్సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరఫున ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే విధానంగా చర్యలు తీసుకుంటామని విద్యార్థుల కుటుంబాలను ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని మంత్రి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు.

అంతేకాకుండా తక్షణ సహాయం కింద ప్రభుత్వం తరఫున రూ. 25వేల నగదు సహాయం అందించడం తోపాటు మృతదేహాలను జగిత్యాల నుండి వారి ఇంటికి తరలించడానికి అవసరమైన అంబులెన్స్ ప్రభుత్వం ద్వారా ఇప్పించారు. అంతర్ రాష్ట్ర పర్యటనలో ఉన్నప్పటికీ అనుకూలం బాధిత కుటుంబాలను సహాయం అందించాలని అధికారులను అప్రమత్తం చేస్తు మంత్రి అడ్లూరి తీసుకున్న చర్యల పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.



## ఫీజుల బకాయి బిజెపి లడాయి

**ఫీజు రీయంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలి....**
**రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ అనూప్ రావు....**




**ముద్ర, కోరుట్ల;** విద్యార్థుల పెండింగ్ ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ కోరుట్ల పట్టణ అధ్యక్షులు కస్తూరి లక్ష్మి నారాయణ ఆధ్వర్యంలో జాతీయరహదారి పై భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కి వినతి పత్రం సమర్పించారు. ఈ నిరసన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ అనూప్ రావు జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు రాష్ట్ర ఐఎంఏ మహిళా విభాగం చైర్మన్ స్వేతి అనూప్ రావు మాట్లాడుతూ పేద మధ్యతరగతి విద్యార్థుల చదువుకు ఫీజు రియంబర్స్మెంట్ ఎంతో కీలకమని అన్నారు. ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ను విడుదల చేయకుండా కాలయాపన చేయడం వల్ల చాలామంది విద్యార్థులు వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు.

రాష్ట్ర ప్రభుత్వం నలభై లక్షల మంది విద్యార్థులకు బకాయి ఉన్న 15వేల కోట్ల పైచిలుక ఫీజులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్మెంట్ కోసం విద్యార్థులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే బిజెపి ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. విద్యార్థుల చదువుకు ఆటంకం కలిగించే విధంగా ఫీజు బకాయిలను పెండింగ్లో పెట్టడం సరికాదన్నారు. తక్షణమే ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేసి విద్యార్థుల విద్యా భవిష్యత్తును భరోసా కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్ ను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు మరియు బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శులు ఎర్ర రాజేందర్, చెట్లపెల్లి సాగర్, మ్యాకల గణేష్, గందే నవీన్, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు శేఖర్ రెడ్డి బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు దమ్మ సంతోష్ రెడ్డి, బీజేవైఎం నాయకులు కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## స్కూల్ బస్సు డ్రైవర్‌కు 5 సంవత్సరాల అనుభవం ఉండాలి

**డీఎస్పీ ఏ. రాములు....**




**ముద్ర, కోరుట్ల;** పాఠశాల విద్యార్థుల ప్రయాణ భద్రతను మెరుగుపరిచే లక్ష్యంతో జగిత్యాల జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో మెట్ పల్లిలో స్కూల్ బస్సు డ్రైవర్లు, పాఠశాల యాజమాన్యాలకు సమగ్ర రోడ్డు భద్రతా అవగాహన సదస్సు నిర్వహించారు. జగిత్యాల జిల్లా రవాణా అధికారి సందాని మహమ్మద్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సదస్సుకు కోరుట్ల డీఎస్పీ ఏ. రాములు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ రాములు, రవాణా అధికారి సందాని మహమ్మద్ లు డ్రైవర్లు పాటించాల్సిన కీలక భద్రతా నియమాలను వివరించారు.

## అథ్లెటిక్స్ లో అల్ఫోర్స్ ఇ-టెక్నో విద్యార్థుల సత్తా..

**రాష్ట్ర స్థాయికి పలువురు ఎంపిక**

**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్‌లో నిర్వహించిన తొలి కిడ్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీల్లో అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు అత్యధిక బంగారు పతకాలు సాధించి ప్రతిభ చాటారు. బంగారు పతకాలు గెలిచిన విద్యార్థులు ఈ నెల 7న హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలను అభినందించారు. అథ్లెటిక్స్ అన్ని క్రీడలకు మూలాధారమని, ప్రతి క్రీడాకారుడిలో వేగం, బలం, ఓర్పు, చురుకుదనం పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పరుగు, జంప్స్, త్రోస్ వంటి విభాగాల ద్వారా విద్యార్థుల సహజ ప్రతిభ వెలుగులోకి వస్తుందని, పాఠశాల స్థాయి నుంచే అథ్లెటిక్స్‌కు ప్రోత్సాహం అందిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు.

పోటీల్లో 4వ తరగతి విద్యార్థిని ఓ. ఆశ్రిత అండర్-10 విభాగంలో 60 మీటర్ల పరుగులో బంగారు పతకం సాధించగా, 7వ తరగతి విద్యార్థి ఆరుష్ అండర్-12 విభాగంలో స్టాండింగ్ లాంగ్ జంప్‌లో బంగారు పతకంతో పాటు షాట్‌పుట్, బ్యాక్ త్రోల్లో రజత పతకాలు గెలుచుకున్నాడు. 5వ తరగతి విద్యార్థి ఫైజాన్ అండర్-12 విభాగంలో 60 మీటర్లు, 400 మీటర్ల పరుగుల్లో రెండు బంగారు పతకాలు సాధించాడు.



అలాగే 8వ తరగతి విద్యార్థి సాకేత్ అండర్-14 కిడ్ జావెలిన్ త్రోలో రజత పతకం, మాన్విత స్టాండింగ్ లాంగ్ జంప్‌లో రజతం, 60 మీటర్ల పరుగులో కాంస్యం, సిద్ధాంత్ స్టాండింగ్ లాంగ్ జంప్‌లో రజతం, ప్రణ్య 300 మీటర్ల పరుగులో కాంస్యం, హ్రిధన్ అండర్-8 విభాగంలో 150 మీటర్ల పరుగులో కాంస్య పతకాలు సాధించి పాఠశాలకు కీర్తి తీసుకొచ్చారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చేలా ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు డాక్టర్ నరేందర్ రెడ్డి తెలిపారు. అనంతరం విజేతలకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ కు కేపీఎస్ విద్యార్థుల ఎంపిక



**ముద్ర, కోరుట్ల;** జగిత్యాల జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన కోరుట్ల పట్టణానికి చెందిన కేపీఎస్ విద్యార్థుల జి. అనియా, జి. రివాన్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. గత నెల జూలై 24 న జగిత్యాల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో జి. అనియా అండర్ 10, జి. రివాన్ అండర్ 8.60 మీటర్ విభాగంలో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్య రెడ్డి తెలిపారు. జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ కు ఎంపికైన కోరుట్ల పట్టణానికి చెందిన కేపీఎస్ విద్యార్థులు జి. అనియా, జి. రివాన్ లు ఈ నెల 7, 8 తేదీలలో హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని వెల్లడించారు. వీరిని కోరుట్ల పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ గుజ్జేటి వెంకటేష్ అభినందిస్తూ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లోనూ అదే ప్రతిభ కనబరిచి రాణించాలని ఆశీర్వదించారు.

## స్వర్ణ ప్రాజెక్టు సాగునీటి విడుదల చేసిన ఎంఎల్ఏ ఏలేటి

**ముద్ర ప్రతినిధి, నిర్మల్ :** నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్వర్ణ ప్రాజెక్టు నుంచి జౌళి నాలా ద్వారా నీటిని విడుదల చేశారు. జౌళి ద్వారా 80 క్యూసెక్కులు, లెఫ్ట్ కెనాల్ ద్వారా 20 క్యూసెక్కుల నీటిని మొత్తం 100 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు. ఈ ప్రాంతాల్లోని వేల ఎకరాలకు రైతులు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

అలాగే స్వర్ణ ప్రాజెక్టు గేట్ల లీకేజీలను పరిశీలించి, అవసరమైన మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆదేశించారు. నీటి వృథాను నివారిస్తూ, సాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రాజెక్టు నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని అధికారులకు సూచించారు.

రైతుసంక్షేమమే లక్ష్యంగా వ్యవసాయానికి అవసరమైన మౌలిక వసతులు కల్పన, సాగునీటి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ రైతులకు అండగా నిలుస్తున్నామన్నారు రైతుల అవసరాన్ని బట్టి రానున్న రోజుల్లో నీటి విడుదల పరిమాణం పెంచనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నరేష్, జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, ప్రధాన కార్యదర్శి విలాస్,



నిరంజన్ రెడ్డి, బీజేపీ నాయకులు రాంశంకర్ రెడ్డి, సాహెబ్ రావు, బడి పోతన్న, వెంకటేష్, జౌళి గ్రామ సర్పంచ్ కొమ్ము సురేందర్, చెన్న రాజేశ్వర్, తిరుమల చారి, విజయ్, నారాయణ, కోరిపెల్లి రాజేశ్వర్ రెడ్డి, కార్యకర్తలు ఇరిగేషన్ శాఖ అధికారులు అనిల్, రైతులు, పరిసర గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

**కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్**



**ముద్ర, కోరుట్ల;** ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని కేజీబీవీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం రోజు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, మౌలిక వసతులు, విద్యా ప్రమాణాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

## వనమాల జ్ఞాపకార్థం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు




**మహాదేవపూర్, ముద్ర:** స్వర్గీయ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు ఏకైక సోదరి సువర్ణ వనమాల జ్ఞాపకార్థం రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఏర్పాటుచేసిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల శిబిరాన్ని , కంటి అద్దాల పంపిణీ కార్యక్రమాన్ని టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీనుబాబు నేడు ప్రారంభించారు. ఎం.ఎన్.జే క్యాన్సర్ ఆస్పత్రి సహకారంతో మహదేవపూర్ సామాజిక ఆసుపత్రిలో నిర్వహించిన శిబిరానికి పెద్ద ఎత్తున పల్లె ప్రాంతాల నుండి స్త్రీలు, రోగులు పరీక్షలు చేయించుకున్నారు. ఉచిత క్యాన్సర్ శ్రీను పరీక్షలు నిర్వహించే మొబైల్ ల్యాబ్ ను జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు కోట రాజబాబు ప్రారంభించారు. వీరితోపాటు సువర్ణ వనమాల కుటుంబ సభ్యులు ఫ్యాక్స్ చైర్మన్ చల్లా తిరుపతిరెడ్డి సర్పంచ్ హసీనా భాను, కాంగ్రెస్ నాయకులు వామన్ రావు, విలాస్ రావు, కటకం అశోక్, అసరార్ ఖురేషి, లేతకరి రాజబాబు, పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు వాలంటీర్లుగా వ్యవహరించారు. నిర్వాహకుడు మహేందర్ యాదవ్ మాట్లాడుతూ పెద్ద ఎత్తున పల్లె ప్రజలు ఈ శిబిరాన్ని ఉపయోగించుకున్నారని కాంగ్రెస్ కార్యకర్తలు అనేకమంది చూపులేని వారికి ఫోన్లు చేసి కంటి అద్దాలు అందజేసినట్లు తెలిపారు. క్యాటరాక్ట్ ఆపరేషన్ల కోసం ఉచిత బస్సులు ఏర్పాటు చేసి రోగులను హైదరాబాద్ తరలించినట్లు తెలిపారు. క్యాంపు విజయవంతానికి కృషి చేసిన నిపుణులైన డాక్టర్లకు ఎం ఎన్ జి డాక్టర్ల బృందానికి స్థానిక ఆసుపత్రి డాక్టర్లకు, వాలంటీర్లుగా సేవలందించిన కాంగ్రెస్ కార్యకర్తలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## మొక్కజొన్న పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు

**ముద్ర, కోరుట్ల;** మల్లాపూర్ మండలంలోని చిట్టాపూర్ గ్రామంలో మొక్కజొన్న పరిశోధన స్థానం కరీంనగర్ శాస్త్రవేత్తలు డా. బి రాంప్రసాద్, డా. ఇ. రజనీకాంత్ మొక్కజొన్న పంటను పరిశీలించడం జరిగింది. గత వారంలో కురిసిన అధిక వర్షాల వలన మండలం లో చాలా చోట్ల మొక్కజొన్న పంట వడలిపోయి, అక్కడక్కడా ఎండిపోవడాన్ని గమనించి, ఇది భూమిలో ఉండే శిలీంద్రం వలన వస్తుంది. వారి వెంట వ్యవసాయ అధికారి లావణ్య, సర్పంచ్ శంకరమ్మ, రైతులు కంది రవీందర్, గడ్డం రాజు, రాకేష్, తదితరులు ఉన్నారు.

# ఆహ్లాదకరమైన వాతావరణంలో బోధన జరగాలి

**కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అందించాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోన్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన వివరాలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల సంఖ్య, మధ్యాహ్న భోజనం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు విద్యార్థులంతా క్రమం తప్పకుండా బడికి వచ్చే విధంగా చూడాలన్నారు. విద్యార్థులతో ఇంగ్లీషు కథలు చదివిపించి, ప్రశ్నలు అడిగి వారి నుంచి జవాబులు రాబట్టారు. సమాధానాలు చెప్పిన విద్యార్థులను అభినందించి, వారికి పెన్నులు బహుమతులుగా ఇచ్చారు. పిల్లలకు అర్థం కాని పదాలను బోర్డు మీద రాసి వివరించారు. అనంతరం పుస్తకాలను చదివించడం ద్వారా భాషా జ్ఞానం, నైపుణ్యం పెరుగుతుందన్నారు. పదవ తరగతి






విద్యార్థులతో మాట్లాడుతూ ఇప్పటివరకు పూర్తయిన సిలబస్ అడిగారు. భౌతిక శాస్త్ర సబ్జెక్టులో దర్పణాల పాఠంలో నుంచి విద్యార్థులను ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. జవాబులు చెప్పిన విద్యార్థులను ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. వారికి పెన్నులను బహుమతులుగా అందించారు.ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, తహసిల్దార్ సంతోష్, ఎంపీవో ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 05.08.2026
www.mudranews.in | @mudranews



**కిడ్నీ రాళ్లకు నిమ్మరసం ఉపయోగపడుతుందా?**



నిమ్మరసంలో ఉండే సిట్రేట్ కాల్షియం రాళ్లు ఏర్పడకుండా కొంతవరకు సహాయపడుతుంది. ప్రతిరోజూ నీటిలో కొద్దిగా నిమ్మరసం కలిపి తాగడం వల్ల ప్రయోజనం ఉండొచ్చు. అయితే ఇది వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు.

# క్రమశిక్షణతో కూడిన అలవాట్లే విజయానికి పునాది

**జిల్లా ఎస్పీ నరసింహ**
**నషా ముక్త్ భారత్ అభియాన్‌లో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన**




**ముద్ర, సూర్యాపేట, ఆగస్టు 4:** క్రమశిక్షణతో కూడిన అలవాట్లు మంచి భవిష్యత్తుకు, విజయానికి బాటలు వేస్తాయని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ అన్నారు. యువత మంచి, చెడులను గ్రహించి చెడు మార్గాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాలు జీవితాలను నాశనం చేస్తాయని హెచ్చరించారు.నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట పోలీసులు, బ్రహ్మకుమారీస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని 60 ఫీట్ల రోడ్డులో ఉన్న జయ పాఠశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన, విద్యార్థుల ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ నరసింహ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాదక ద్రవ్యాలు, గంజాయి నిర్మూలనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని, ప్రధానమంత్రి పిలుపు మేరకు "నషా ముక్త్ భారత్ అభియాన్" ద్వారా దేశవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. పేదరికాన్ని జయించి శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా ఎదిగిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం విద్య, సాంకేతికత, రవాణా వంటి అనేక అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు.సోషల్ మీడియాకు బానిసలు కాకుండా సాంకేతికతను విద్యాభివృద్ధికి వినియోగించాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా నేరాలకు దారితీస్తున్నాయని, కుటుంబ బంధాలను దెబ్బతీస్తున్నాయని తెలిపారు. సమాజం నుంచి మాదకద్రవ్యాలను పూర్తిగా తరిమికొట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.మహిళలు, బాలికల భద్రతకు జిల్లా పోలీసులు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. బాలికలను ఎవరైనా వేధించినా వెంటనే డయల్-100కు సమాచారం అందించాలని, ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధిత మహిళలు, బాలికలకు అండగా నిలిచేందుకు 'పోలీస్ అక్క' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు.సైబర్ మోసాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో అపరిచితుల మాటలను నమ్మి వ్యక్తిగత, బ్యాంకు వివరాలను పంచుకోవద్దని హెచ్చరించారు. అలాగే మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.కార్యక్రమంలో విద్యార్థులతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా పోలీసు కళాబృందం పాటలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా డ్రగ్స్ నిర్మూలన, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించింది.ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధి హిమబిందు, జయ పాఠశాల ప్రిన్సిపాల్ ఉపేందర్, టౌన్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ఎస్‌ఐలు యాదవేందర్, కనకరత్నం, షీ టీమ్ ఎస్‌ఐ నీలిమ, విద్యార్థులు, బ్రహ్మకుమారీస్ సంస్థ సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## భావితరాల భవిష్యత్తుకే వనమహోత్సవం

**అదనపు కలెక్టర్ ఏ.భాస్కర్ రావు**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** మండలంలోని వడాయిగూడెం గ్రామంలో పర్యావరణ పరిరక్షణ, హరిత వాతావరణమే ధ్యేయంగా గ్రామ సర్పంచ్ నీల శిరీష ఓంప్రకాశ్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం 'వనమహోత్సవం' కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఏ. భాస్కర్ రావు మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్య నివారణకు, పర్యావరణ సమతుల్యతకు ప్రతీ ఒక్కరూ భాగస్వాములై మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. వడాయిగూడెం గ్రామాన్ని మోడల్ గ్రీన్ విలేజ్‌గా తీర్చిదిద్దేందుకు పంచాయతీ పాలకవర్గం చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.నాగిరెడ్డి, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ తుక్యా నాయక్, జిల్లా పంచాయతీ అధికారి కె.శ్రీనివాస్ రెడ్డి, బి శ్రీకాంత్ రెడ్డి, విజయలక్ష్మి, వేణు కుమార్ ఎస్ఐ,యం దినకర్, మల్లేష్, సుక్కల శంకర్, ఆమని పాల్గొన్నారు.

## తల్లి, బిడ్డల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

**కలెక్టర్ అనురాగ్ జయంతి**



**ముద్ర ప్రతినిధి యాదాద్రి భువనగిరి:** అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు.మంగళవారం యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని అంగడి బజార్, రాయగిరి అంగన్వాడీ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్, చిన్నారుల హాజరు, పోషకాహారం, బోధన, గర్భిణులకు అందుతున్న సేవలను పరిశీలించారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని సూచించారు.అంగన్వాడీ సిబ్బంది ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)కు సంబంధించిన ఫారాలను అర్హులైన వారందరి నుంచి సేకరించి, తప్పులు లేకుండా సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో శిశు సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఎంపీడీవో నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** జిల్లా ఎస్పీ అక్షాంష్ యాదవ్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై నేడు సుమంగళి ఫంక్షన్ హాల్లో పట్టణ వ్యాపారస్తులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పట్టణ సిఐ రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాపారస్తులు సదస్సుకు హాజరై సైబర్ నేరాల నియంత్రణలో భాగస్వాములు కావాలని కోరారు.

## కారేపల్లి ఠాణాను సందర్శించిన సీపీ



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** కారేపల్లి పోలీస్ స్టేషన్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆకస్మికంగా సందర్శించారు. వార్షిక తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్ కు చేరుకున్న పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, విచారణ నివేదికలు, జనరల్ డైరీ రికార్డులను, సీజ్ చేసిన వాహనాలు, పరిసరాలను పరిశీలించారు. సెక్టర్ పోలీస్ ఆఫీసర్లతో మాట్లాడారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేసేందుకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలలో అవగాహన పెంపొందించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అయిన కేసులు, డయల్ 100 కాల్స్ ప్రతిస్పందన సమయం, పెండింగ్ కేసులు పరిశీలించారు. విధిగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ.. వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని అన్నారు. రౌడీ షీటర్లపై దృష్టి పెట్టాలని, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ తిరుపతి రెడ్డి, సిఐ సాగర్, ఎస్సై గోపి పాల్గొన్నారు.

# వేణుకు న్యాయం జరిగే వరకు పోరాడతాం

**నిరుద్యోగి వేణును ఫోన్‌లో పరామర్శించిన కేటీఆర్**





**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ఉద్యోగ నోటిఫికేషన్లు, జాబ్ క్యాలెండర్ విడుదలలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరికి నిరసనగా ఆత్మహత్యాయత్నం చేసిన మధిర నియోజకవర్గానికి చెందిన నిరుద్యోగ యువకుడు గడ్డం వేణును బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి ఆసుపత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోన్ ద్వారా వేణుతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకపోవడం వల్లే తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు వేణు కేటీఆర్‌కు తెలిపాడు. తన ఘటనను వ్యక్తిగత ప్రేమ వ్యవహారంగా చిత్రీకరిస్తూ ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తోందని ఆరోపించాడు. సొంత ఇల్లు లేకపోయినా తనకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేయలేదని కూడా వాపోయాడు.అనంతరం ఖమ్మంలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ, వేణు రాసిన సూసైడ్ నోట్ తెలంగాణలోని లక్షలాది మంది నిరుద్యోగుల ఆవేదనకు ప్రతిబింబమని అన్నారు. దీనినే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజాక్షేత్రంలో చార్జిషీట్‌గా మారుస్తామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేణు కుటుంబానికి, నిరుద్యోగులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన 'యూత్ డిక్లరేషన్'ను అమలు చేయకుండా నిరుద్యోగులను మోసం చేసిందని రాకేష్ రెడ్డి విమర్శించారు. ఏళ్ల తరబడి ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువతకు సరైన జాబ్ క్యాలెండర్ లేకపోవడం, నోటిఫికేషన్లు రాకపోవడం వల్ల తీవ్ర నిరాశ నెలకొందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విస్మరించారని ఆరోపించారు.ప్రభుత్వానికి కమిషన్లు వచ్చే పనులపై ఉన్న శ్రద్ధ ఉద్యోగాల భర్తీపై లేదని ఎద్దేవా చేశారు. హౌసింగ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సొంత జిల్లాలోనే అత్యంత పేద కుటుంబానికి చెందిన వేణుకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కూడా మంజూరు కాలేదని, అధికార పార్టీ వారికి మాత్రమే ఇళ్లు కేటాయిస్తున్నారని ఆరోపించారు.అయితే, ఎలాంటి సమస్యలు ఎదురైనా నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడకుండా ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడి తమ హక్కులను సాధించుకోవాలని రాకేష్ రెడ్డి పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో గూడా సంజీవ్ రెడ్డి, బలుసు మురళీకృష్ణ, మద్దెల విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా తిరువీధి ఉత్సవం



**స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో విశ్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని మాడవీధులలో శోభాయమానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య తిరువీధి ఉత్సవ సేవను నిర్వహించారు. తిరువీధి ఉత్సవ సేవ అనంతరం దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు.** - ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి

## సంస్థాన్ నారాయణపూర్ ఠాణా తనిఖీ



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** సంస్థాన్ నారాయణపూర్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పి అక్షాన్ష్ యాదవ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని జనరల్ డైరీ ఎంట్రీ బుక్‌తో పాటు స్టేషన్ రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, నమోదు విధానం సక్రమంగా ఉందో లేదో తనిఖీ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత, నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. ఎస్‌హెచ్ఓ జగన్ ఎస్పీ వెంట ఉండి పోలీస్ స్టేషన్ పనితీరు, చేపడుతున్న కార్యక్రమాలు, ప్రస్తుత పరిస్థితులపై వివరాలు అందించారు..

## రూ.3.72 కోట్ల బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన



**ముద్ర, దేవరకొండ:** పీఏ పల్లి మండలం సూరెపల్లి–అంగడిపేట మధ్య చిలకమర్రి, నీలంనగర్ గ్రామాల మీదుగా రూ.3.72 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ రహదారి పూర్తయితే ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు, రైతులకు వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సులభమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## న్యాయవాది మల్లయ్య హత్యకు నిరసనగా కోర్టు విధుల బహిష్కరణ



**ముద్ర, రామన్నపేట:** నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ కోర్టు పరిధిలోని మల్లయ్య అనే న్యాయవాదిపై తీవ్రంగా దాడి చేసి హత్య చేసిన దానికి నిరసనగా రామన్నపేట కోర్టు పరిధిలో విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండి మజీద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మామీడి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ న్యాయవాదిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. దాడులు హత్యల సంస్కృతిని మానుకోవాలని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బాలరాజు, ప్రధాన కార్యదర్శి యాదాసు యాదయ్య, ఉయ్యాల హనుమంతు గౌడ్, బాతరాజు అశోక్ కుమార్, అమానుల్లా ఖాన్, నోముల స్వామి గడ్డం నరసింహ,సతీష్ రెడ్డి అజీజుద్దీన్, సురేష్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## 10న జరిగే జైలు భరోను జయప్రదం చేయండి



**ముద్ర, బీబీనగర్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 10న క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో జరిగే దేశవ్యాప్త జైలు భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు మండల కన్వీనర్ బండారు శ్రావణ్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్, రైతు సంఘం మండల నాయకులు బండారు శ్రీరాములు పిలుపునిచ్చారు.మంగళవారం సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం. రైతు సంఘాల.మండల కమిటీల ఆధ్వర్యంలో బ్రాహ్మణపల్లి రోడ్డు చౌరస్తా సెంటర్లో జైలు భరో కార్యక్రమం విజయవంతం కోసం ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాల కార్మికులు నోముల బస్వారెడ్డి, ఆడపల్లి జంగయ్య, కట్ట శేఖర్, భక్తుల రాజు, కూర కొండల్, గడ్డ వెంకటేష్ , శ్రీనివాస్, సురేష్ రఘుపతి పాల్గొన్నారు.

## సీఎం పై ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ నేతలు




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగం నోటిఫికేషన్ ఇవ్వడం లేదని మనస్థాపానికి గురై న్యూ లక్ష్మీపురం గ్రామానికి చెందిన గడ్డం వేణు కుమార్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నేపథ్యంలో బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ముదిగొండ పీఎస్ లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుని ముదిగొండ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు స్వీకరించారు. తక్షణమే ప్రభుత్వం వేణు కుమార్ కుటుంబాన్ని ఆదుకోవాలని వారికి పక్కా ఇల్లు కేటాయించాలని రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువతకు వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముదిగొండ మండలం మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్ మండల కార్యదర్శి గడ్డం వెంకట్ గౌడ్ మాజీ రైతుమండల కోఆర్డినేటర్ పోట్ల వెంకటప్రసాద్ సీనియర్ నాయకులు బంకా మల్లయ్య, తోట ధర్మారావు, పొనుగుల కోటేష్ యాదవ్, షేక్ కాజా, కొమ్మూరి రమేష్ , హఫీజ్ ఎండి ఖాసీం బాబు కే నాగార్జున యంసంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జైల్ బరో ను జయప్రదం చేయండి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** దేశంలోబిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ఈనెల 10వ తేదీన క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తితో జరుగుతున్న జైలు భరోను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దాసరి పాండు పిలుపునిచ్చారు. మంగళవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భువనగిరి జిల్లా కేంద్రంలో ఈనెల 10వ తేదీన జరుగు జైలు భరో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయాలని కోరుతూ బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కార్మిక కర్షకులు హక్కులను లేకుండా చేస్తూ కార్మికులతో వెట్టి చాకిరి చేయించు కోవడానికి యాజమాన్యాలకు అనేక నూతన చట్టాలను తీసుకొస్తూ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు లేకుండా చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మాయ కృష్ణ, సిఐటియు పట్టణ కన్వీనర్ గంధమల్ల మాతయ్య, నాయకులు రామచందర్, రవి, రాజయ్య, వెంకటేశం, అంజయ్య పాల్గొన్నారు.

## రైతులు అరుతడి పంటలనే పండించాలి



**ముద్ర, దేవరకొండ:** రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వినోద్ కుమార్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ఉమ్మడి గాజీనగర్ గ్రామంలో వరి ఆయిల్ ఫామ్ పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్నినో ప్రభావంతో వర్షాలు తగ్గుముఖం పడుతున్న కారణంగా రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. వర్షాభావ పరిస్థితులు ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పుడు తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలు సాగు చేయడం రైతులకు ఎంతో మేలు అని అన్నారు. పెసర్లు, మినుములు, కందులు, జొన్నలు, మొక్కజొన్న, వేరుశనగ, సన్ ఫ్లవర్, నువ్వులు వంటి పంటలను సాగు చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, లాభాలు పొందవచ్చునని రైతులకు సూచించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి శేఖర్ సహాయ వ్యవసాయ సంచాలకురాలు శ్రీలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి రవి నాయక్, మండల వ్యవసాయ అధికారి జానకి రాములు, ఏఈవోలు, నేనావత్ లక్కీదాస్ నాయక్, రైతులు తదితరులు పాల్గొనారు.

సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

బుధవారం 05.08.2026

www.mudranews.in | @mudranews



### కొండపిండి ఆకులు కిడ్నీ రాళ్లకు ఉపయోగమా?



కొండపిండి ఆకులను సంప్రదాయ వైద్యంలో మూత్ర విసర్జనను పెంచే గుణాలు ఉన్న మొక్కగా ఉపయోగిస్తుంటారు. అయితే ఇవి కిడ్నీ రాళ్లను కరిగిస్తాయని లేదా పూర్తిగా తొలగిస్తాయని నిర్ధారించే బలమైన శాస్త్రీయ ఆధారాలు ప్రస్తుతం లేవు. వైద్యుల సలహాతో మాత్రమే వీటిని ఉపయోగించడం మంచిది.

# అజిత్ ధోవల్ అద్భుతం.



## కీలక విషయాలు వెల్లడించిన అమిత్‌షా

**ముద్ర, ఢిల్లీ :** అజిత్ ధోవల్.. జాతీయ భద్రతా సలహాదారు. భారత గూఢచార వ్యవస్థ ఇన్‌చార్జి. దేశ రక్షణే ధ్యేయంగా తన సర్వస్వం త్యాగం చేస్తున్నారు. ఎలాంటి ఆర్భాటాలు, ప్రచారం లేకుండా తన పని తాను చేసుకుపోతుంటారు. తాజాగా అజిత్ ధోవల్ గురించి కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు ఆయన పాత్రను మరోసారి స్పష్టం చేస్తున్నాయి. ఇవి కేవలం ప్రశంసలు కాకుండా, నిర్ణయాలు తీసుకునే స్థాయిలో ధోవల్‌పై ఉన్న విశ్వాసాన్ని, ఆయన పని తీరును ప్రతిబింబిస్తున్నాయి.2014లోనే సంపూర్ణ విశ్వాసం..అమిత్ షా 2014లో తన చీఫ్ సెక్రెటరీగా కూడా మొదటగా అజిత్ ధోవల్‌ను నియమించాలని భావించినట్లు తెలిపారు. ఇది ధోవల్‌పై ఉన్న అత్యధిక విశ్వాసాన్ని సూచిస్తుంది. సాధారణంగా చీఫ్ సెక్రెటరీ పదవి పరిపాలనా నైపుణ్యానికి సంబంధించినది. అయినా భద్రతా, గూఢచార రంగంలో అనుభవం ఉన్న వ్యక్తిని అలా పరిగణించడం, ఆయన సామర్థ్యం పరిపాలనా స్థాయిలోనూ విలువైనదిగా భావించబడిందని అర్థమవుతుంది.గుజరాత్ బాంబు పేలుళ్ల నేపథ్యం..గుజరాత్‌లో వరుస బాంబు పేలుళ్లు జరిగిన సమయంలో అప్పటి ముఖ్యమంత్రి నరేంద్ర మోదీ, అమిత్ షాను పిలిచి అజిత్ ధోవల్‌ను రప్పించాలని ఆదేశించారు. కేవలం పేలుళ్లపై ఉపరితల విచారణ చేయకుండా, ఘటన వెనుక ఉన్న మూల కారణాలు, నెట్‌వర్క్‌లను గుర్తించాలని సూచించారు. ధోవల్ గుజరాత్‌కు వచ్చిన తర్వాత జరిగిన దర్యాప్తులో గుజరాత్ పేలుళ్లకు సంబంధించిన వారితోపాటు సీరియల్ బాంబ్ బ్లాస్ట్‌లకు కారకులను కూడా పట్టుకోగలిగారు. ఇది ఆయన పని తీరులోని లోతైన విశ్లేషణ, సమన్వయ సామర్థ్యాన్ని తెలియజేస్తుంది. సాధారణ పోలీసు విచారణ స్థాయిని మించి, బహుళ కేసుల మధ్య సంబంధాలను ఏర్పరచి ఫలితాలు సాధించిన ఉదాహరణగా ఇది నిలుస్తుంది.ప్రచారం లేని శక్తి..అమిత్ షా ధోవల్‌ను ఎలాంటి ప్రచారం చేసుకోని వ్యక్తిగా వర్ణించారు. ఆయన శక్తి అంటే ఫలితాలు సాధించడమే తప్ప, మీడియా లేదా ప్రజా దృష్టిలో తనను తాను ప్రదర్శించుకోవడం కాదని స్పష్టమవుతుంది. భద్రతా రంగంలో ఇలాంటి తక్కువ ప్రొఫైల్, అధిక ప్రభావం కలిగిన వ్యక్తులు అరుదు. ఇది ధోవల్‌ను వ్యక్తిగత ప్రచారం కంటే జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చే నాయకుడిగా చూపిస్తుంది.మొత్తంగా, అమిత్ షా వెల్లడించిన అంశాలు అజిత్ ధోవల్‌ను కేవలం అధికార పదవిలో ఉన్న వ్యక్తిగా కాకుండా, క్లిష్ట పరిస్థితుల్లో ఫలితాలు సాధించగల, ప్రచారం లేకుండా పని చేసే జాతీయ భద్రతా నిపుణుడిగా చిత్రీకరిస్తున్నాయి.

## పి ఆర్ సి వెంటనే అమలు చేయాలి




**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ మిరుదొడ్డి మండల శాఖ అధ్యక్షులు ఏ.రామచంద్రం ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని కొండాపూర్ అందె, అల్వాల, చెప్యాల, మల్లుపల్లి, కాసులాబాద్, ధర్మారం,మిరుదొడ్డి,లక్ష్మీనగర్,ఆరెపల్లి, తదితర గ్రామాలలో సభ్యత్వ స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి తిరుపతిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందని ఉపాధ్యాయ ఉద్యోగులకు 2023 జూలై నుండి రావాల్సిన పిఆర్సిని నేటి వరకు అమలు చేయకపోవడం దారుణమని వెంటనే పిఆర్సి కమిటీ నివేదికను తెప్పించుకొని అమలు చేయాల్సిందిగా డిమాండ్ చేశారు, ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన ఆరు పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు, నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల సిద్దిపేటలో నిన్న సస్పెండ్ అయిన ఆరుగురు ఉపాధ్యాయుల సస్పెన్షన్ ఎత్తివేయాలి, ఉపాధ్యాయుల పొరపాట్లు ఉంటే షోకాజు నోటీసు ద్వారా హెచ్చరించి అవకాశం ఇయ్యాల్సి ఉండే అని అభిప్రాయపడ్డారు . జిల్లావ్యాప్తంగా విద్యార్థుల సంఖ్య కనుగుణంగా ఉపాధ్యాయ పోస్టులను సర్దుబాటు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని కోరారు, ఉపాధ్యాయులకు జూన్ 1 నుండి హెల్త్ కార్డును అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం నేటి వరకు నిబంధన రూపొందించకపోవడం విచారకరం వెంటనే హెల్త్ కార్డును అమలు అయ్యేటట్టు చూడాల్సిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి డి. యాదగిరి, జిల్లా ఉపాధ్యక్షులు ర్యాకం మల్లేశం, జిల్లా కార్యదర్శి గూడూరి శివాజీ, జిల్లా కౌన్సిలర్ జె.శ్రీకాంత్,విజయ్, తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా పోలీస్ ఉద్యోగ నియామకాలు

**పరీక్షల నిర్వహణపై ప్రత్యేక నిఘా** | **అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం**



**ముద్ర, హైదరాబాద్ :** పోలీస్ ఉద్యోగ నియామకాల భర్తీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం 7437 పోస్టుల భర్తీ ప్రక్రియపై నిఘా వర్గాలు ముఖ్యమంత్రికి కీలక సమాచారం అందించాయి. నియామక ప్రక్రియకు ఎలాగైనా భంగం కలిగించాలని కొన్ని రాజకీయ పార్టీలతో పాటు ఇతర శక్తులు ప్రయత్నిస్తున్నట్లు నిఘా వరాలు సీఎం దృష్టికి తీసుకెళ్లాయి. ఈ నేపథ్యంలో డీజీపీ సీవీ ఆనంద్ తో పాటు పోలీస్ ఉన్నతాధికారులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇటీవల విడుదలైన నోటిఫికేషన్ కు సంబంధించి నియామక ప్రక్రియను పకడ్బందీగా, పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని సీఎం ఆదేశించారు. నియమ నిబంధనలను అనుసరించి ఎలాంటి లోపాలకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. ప్రశ్నపత్రాల తయారీ, ముద్రణ, రవాణాతో పాటు అన్ని ప్రక్రియలలో అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. ముఖ్యంగా కోచింగ్ సెంటర్స్ పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. నియామక పరీక్షల నిర్వహణపై సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో ఎలాంటి దుష్ప్రచారం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేసే దళారులు, నకిలీ వెబ్ సైట్లు, సోషల్ మీడియా అకౌంట్లపై సైబర్ క్రైమ్ విభాగంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణ పూర్తయ్యే వరకు సైబర్ సెక్యూరిటీ, ఇంటలీజెన్స్ విభాగం పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ అత్యవసర సమావేశంలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, డీజీపీ సీవీ ఆనంద్, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శిఖా గోయల్, పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు చైర్మన్ వి.వి.శ్రీనివాస రావు, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ పాల్గొన్నారు.

## సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ పోస్టర్ ఆవిష్కరణ



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ నియోజకవర్గ తెలంగాణ రక్షణసేన (టీఆర్ఎస్) సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ పోస్టర్ నియోజకవర్గ ఇంచార్జ్ బట్టి అజయ్ ఆవిష్కరించారు. తెలంగాణ పోరాటాలతో సాధించుకున్న నేల ఇప్పుడు సామాజిక న్యాయంతో మరింత బలపడాల్సిన సమయం వచ్చింది. ప్రతి బీసీ, ప్రతి ఎస్సీ, ప్రతి ఎస్టీ, ప్రతి మైనారిటీ, ప్రతి మహిళ, ప్రతి యువతకు సమాన అవకాశాలు, సముచిత ప్రాధాన్యం అందే తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా 'సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ' నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహాసభ ప్రజల ఆకాంక్షలకు కొత్త దిశను చూపించే చారిత్రాత్మక సభగా నిలవనుంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఇప్ప రమేష్, కసాపురం అశోక్, టౌన్ ఇన్‌చార్జ్ కేవల్ నందకుమార్, టీఆర్ఎస్ స్టూడెంట్ వింగ్ జిల్లా అధ్యక్షుడు జునైద్, చినశంకరంపేట మండలం గజగట్లపల్లి గ్రామ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు వీరస్వామి, దగడ్ శ్రీకాంత్, ఎల్లం, రాజ్పేట నవీన్, భాను, ప్రేమ్, సయ్యద్ ఇమ్రోజ్, సోహైల్, రేహాన్, అర్సలాన్, మధు తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ నటుడు ప్రదీప్ రావత్ కన్నుమూత



**ముద్ర, మంబాయి:** ప్రముఖ నటుడు ప్రదీప్ సింగ్ రావత్ (74) కన్నుమూశారు. ముంబయిలోని ఆయన నివాసంలో గుండెపోటుతో మృతిచెందారు. 1952లో దిల్లీలో జన్మించిన ఆయన.. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళతోపాటు ఇతర భాషల్లో నటించారు. అలాగే కొన్ని దూరదర్శన్ టీవీ సీరియల్స్‌లో కూడా నటించారు. కెరీర్ తొలి రోజుల్లో ఎక్కువగా విలన్‌గా నటించిన ప్రదీప్ రావత్.. ఆ తర్వాత క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గానూ చేశారు. 'సై'తో మొదలై...తెలుగులో నితిన్ – రాజమౌళి 'సై' (2004)తో ఆయన టాలీవుడ్ ప్రయాణం ప్రారంభమైంది. భిక్షూ యాదవ్‌గా ఆయన పండించిన విలనీకి అద్భుతమైన స్పందన వచ్చింది. ఆ తర్వాత వరుసగా తెలుగులో సినిమాలు చేసుకుంటూ వెళ్లారు. 'భద్ర', 'అందరివాడు', 'ఛత్రపతి', 'లక్ష్మి', 'స్టాలిన్', 'దేశముదురు', 'యోగి', 'జగడం', 'గజిని', 'మస్కా', 'ఓయ్', 'రెబల్', 'నాయక్', 'బాద్షా', 'వన్ నేనొక్కడినే', 'అల్లుడు శీను', 'నేను శైలజ', 'సర్రైనోడు', 'నేనే రాజు నేనే మంత్రి', 'జై లవ కుశ', 'వాల్తేరు వీరయ్య' తదితర తెలుగు చిత్రాల్లో నటించి మెప్పించారు. హిందీలో ఎప్పటి నుంచో...హిందీలో 1985లోనే ప్రదీప్ రావత్ ప్రయాణం మొదలైంది. రాజ్ బబ్బర్ 'ఐత్ బార్' సినిమాలో తొలిసారి ఓ చిన్న పాత్రలో కనిపించారు ప్రదీప్ రావత్. ఆతర్వాత చాలా సినిమాల్లో నటిస్తూ వచ్చినా అక్కడ ఆశించినంత పేరు సంపాదించలేకపోయారు. కొన్ని సినిమాల్లో మాత్రమే ప్రామినెంట్ రోల్స్ దక్కాయి. ఆఖరిగా రిలీజ్ అయిన ఆయన సినిమా 'గాయపడ్డ సింహం'. ఈ సినిమా మే 1న విడుదలైంది. ప్రదీప్ రావత్‌కు పేరు తీసుకొచ్చిన 'సై' .. అవార్డులు కూడా తెచ్చి పెట్టింది. 2004లో ఈ సినిమాకుగాను ఫిల్మ్ ఫేర్ బెస్ట్ విలన్, సంతోషం బెస్ట్ విలన్, నంది అవార్డులు వచ్చాయి.

## పంట పొలాల పరిశీలన



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామంలో శాస్త్రవేత్త డాక్టర్ పల్లవి అర్బన్ మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనాథ్ ఆధ్వర్యంలో మంగళవారం పంట పొలాలను పరిశీలించారు. ప్రస్తుత సీజన్లో వరిలో ముగిపురుగు వచ్చే అవకాశం ఉందని దానికి సంబంధించి వ్యవసాయ శాఖ సూచనల మేరకు మందులు వాడాలని రైతులకు సూచించారు. వారికి తగిన నేటి సౌకర్యం పంట వేర్లకు గాలి అందకపోవడం నేలలో రసాయన చర్యల మార్పు వలన సమస్యలు తలెత్తినప్పుడు సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏ ఈ ఓ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఏఐ దెబ్బ.. జీతం రెండు లక్షల నుంచి 40 వేలకు పడిపోయింది



**ముద్ర, డెస్క్:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అన్ని రంగాలను ప్రభావితం చేస్తున్న నేపథ్యంలో చాలామంది ఉపాధికి దూరంగా జరిగిపోతున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకున్నప్పటికీ ఉపయోగం లేకుండా పోతుంది. దీనివల్ల చాలామంది జీవితాలు రోడ్డు మీద పడుతున్నాయి. మీరు చదవబోయే ఈ కథనంలో ఈ వ్యక్తి పరిస్థితి కూడా అటువంటిదే. ఇతడు కాపీ రైటర్ గా పనిచేసేవాడు. నాడు ఇతడికి 2 లక్షల వరకు వేతనం వచ్చేది. ఎప్పుడైతే ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ అందుబాటులోకి వచ్చిందో.. ఇతడికి పనిలేకుండా పోయింది. ఫలితంగా ఉద్యోగం పోయింది. ఇప్పుడు అతను తెలంగాణ టూరిజం లో పనిచేస్తున్నాడు. తెలంగాణ టూరిజం ను హ్యాండిల్ చేసే ఒక సంస్థలో చేరాడు. ఇప్పుడు అతని వేతనం నెలకు 40,000 మాత్రమే. దీనిని బట్టి అతని పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. పైగా ఆ ఏజెన్సీలో కొంతకాలం మాత్రమే ఉపాధి ఉంటుంది. గతంతో పోలి చూస్తే అతని ఉద్యోగ స్థాయి పెరిగినప్పటికీ.. అతడి కింద కొంతమంది ఉద్యోగులు పనిచేస్తున్నప్పటికీ.. వేతన మాత్రం 40 వేలే ఉంది. పైగా గతంతో పోల్చి చూస్తే అతని స్థాయి కూడా పెరిగింది. కానీ వేతనమే 1,60,000 తగ్గింది. ఆర్టిఫిషియల్ వల్ల క్రియేటివిటీ రంగాలు తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటున్నాయి. ఇప్పటికే కార్టూన్ గీసే వాళ్ళు.. రకరకాల పోస్టర్లు రూపొందించే వాళ్ళు.. గ్రాఫిక్ డిజైనర్లు ఉపాధి కోల్పోయారు. ఇప్పుడు ఏకంగా కాపీ రైటింగ్ కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా నిర్వహించడం ఆందోళన కలిగిస్తోంది. భవిష్యత్ ఇలాగే ఉంటే.. చాలామందికి ఉపాధి కాదు కదా.. ఎటువంటి అవకాశం లేకుండా పోతుంది.

## పోచారం ప్రాజెక్టు పొంగుతోంది



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్–కామారెడ్డి జిల్లాల సరిహద్దులోని పోచారం ప్రాజెక్టు ఉప్పొంగుతోంది. మంగళవారం ఉదయం ఎగువ ప్రాంతాల నుంచి వరద రావడంతో నీటి మట్టం పెరిగి ప్రాజెక్ట్ మత్తడి దూకుతోంది. రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వానకాలం పంటలకు డోకా లేదు. పర్యాటకులను కనువిందు చేస్తోంది. మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేష్ ప్రాజెక్ట్ సందర్శించారు. పర్యాటకులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని ఆదేశించారు. వెంట హవెలి ఘనపూర్ తహసీల్దార్ సింధు రేణుక, ఆర్ఐ సిద్దు తదితరులున్నారు.

## 27 గ్రామాలను కలిపిన శీతలాభవాని ఉత్సవం



**ముద్ర, దేవరకొండ:** మల్లేపల్లి మండల కేంద్రంలోని మల్లెలగుట్టపై బంజారా భవన్ సమీపంలో శీతలా భవాని పండుగను బంజారా సమాజం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించింది. కొండమల్లేపల్లి ఎస్సై అజ్మీరా రమేష్, ఎంఈఓ నాగేశ్వరరావు, ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారి దాస్య నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.మండలంలోని 27 గ్రామపంచాయతీల తండాల నుంచి బంజారా నాయకులు, గ్రామ పెద్దలు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఒకే వేదికపై చేరి ఐక్యతను చాటారు. సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు, యువత, చిన్నారులు పాల్గొని బంజారా సంస్కృతి వైభవాన్ని ప్రతిబింబించారు. ప్రత్యేక పూజలు, నైవేద్యాల అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555